## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!

సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి: 03 సంచిక : 97 శనివారం, జూలై 6, 2024 RNI NO: APTEL16151 పేజీలు : 8 వెల: రూ.2




## లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు మరోసారి చుక్కెదురు..

2లో



## నేడు రేవంత్, బాబు భేటీ

- ప్రజాభవన్ వేదికగా తెలంగాణ, ఏపీ సీఎంల సమావేశం
- షెడ్యూల్ 9, 10లోని అంశాలతో పాటు పలు అపరిష్కృత సమస్యలు, అంశాలు చర్చకు వచ్చే చాన్స్
- తెలంగాణ తరపున హాజరుకానున్న డిప్యూటీ సీఎం భట్టి

2లో



## 'పీఎల్ఐ శాశ్వత సబ్సిడీ కాదు' డ్రోన్ పరిశ్రమ పురోగతికి ప్రభుత్వ సహకారం

2లో



# త్వరలో జాబ్ కేలండర్

- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి విడుదల చేస్తాం
- కాంగ్రెస్ నేతలతో భేటీలో ముఖ్యమంత్రి రేవంత్
- నిరుద్యోగులకు మేలు జరిగేలా త్వరలో నిర్ణయాలు
- తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే నోటిఫికేషన్లు రద్దయ్యే ప్రమాదం
- నిరుద్యోగుల డిమాండ్లపై అధికారులతో సీఎం చర్చ
- హాజరైన విద్యార్థి సంఘాల నేతలు

**ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, నిరుద్యోగులందరికీ మేలు జరిగేలా త్వరలోనే నిర్ణయాలు తీసుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. రానున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి జాబ్ కేలండర్‌ను విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నిరుద్యోగుల ఆందోళనల నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నేతలతో దాదాపు మూడు గంటలకు పైగా ఆయన సమావేశమయ్యారు. భేటీలో భాగంగా నిరుద్యోగుల డిమాండ్ల గురించి సీఎం ఆరా తీశారు. సీఎస్ శాంతికుమారితో పాటు సంబంధిత అధికారులతో నిరుద్యోగుల డిమాండ్లను పరిష్కరించేందుకున్న సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.**

హైదరాబాద్: 'నిరుద్యోగులకు ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికే 28,942 ఉద్యోగ నియామకాలు చేపట్టాం. గ్రూప్-1,2,3 ఉద్యోగాలకు సంబంధించి ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కోర్టు చిక్కులన్నింటినీ అధిగమించాం. జాబ్ కేలండర్ ప్రకారం పోటీ పరీక్షలు నిర్వహించి ఉద్యోగాల భర్తీ కోసం ప్రయత్నిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వ నియామక పరీక్షలు, ఇతర బోర్డులు నిర్వహించే పరీక్షలతో ఆటంకాలు కలగకుండా రాష్ట్రంలోని నిరుద్యోగులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా కేలండర్ రూపొందిస్తున్నాం. ఉద్యోగాల భర్తీ విషయంలో ప్రభుత్వం కూలంకషంగా కసరత్తు చేస్తోంది. కొందరు మాత్రం రాజకీయ ప్రయోజనల కోసం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. వారు చేస్తున్న కుట్రలతో నోటిఫికేషన్లలోని నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకుంటే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిలిచిపోవడంతో పాటు నోటిఫికేషన్లు రద్దయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి కొన్ని రాజకీయ పార్టీలు, స్వార్ధపూరిత శక్తుల కుట్రలకు నిరుద్యోగులు బలి కావొద్దు. గత ప్రభుత్వం లాగా మేం తప్పుడు నిర్ణయాలు తీసుకోలేం. పరీక్షలు జరుగుతున్న సమయంలో నిబంధనలు మారిస్తే చట్టపరంగా తలెత్తే అంశాలను పరిగణనలోకి తీసుకుని ముందుకెళ్తాం..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

### 1:100కు పెంచితే కోర్టులు జోక్యం చేసుకునే చాన్స్: టీజీపీఎస్సీ

గ్రూప్-1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలన్న డిమాండ్‌పై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా టీజీపీఎస్సీ అధికారులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం 2022లో నిర్వహించిన గ్రూప-1 పరీక్ష పేపర్ లీకేజీ కారణంగా రెండుసార్లు వాయిదా పడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం

(మిగతా 2వ పేజీలో)



# పరిశ్రమలకు ఎలాంటి సమస్యలు రానివ్వం

- ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఆరోగ్య సంరక్షణకు ఫార్మా పరిశ్రమ వెన్నెముక లాంటిది
- ఫార్మా కంపెనీలు సీఎస్ఆర్ నిధులు కేటాయించాలి: మంత్రి కోమటిరెడ్డి

మాదాపూర్: రాష్ట్రం నుంచి ప్రతి ఏటా రూ.50 వేల కోట్ల విలువైన మందులను ఎగుమతి చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలి పారు. తమది పారి శ్రామిక అనుకూల ప్రభుత్వమని, పారి శ్రామికవేత్తలకు మంత్రివర్గం 24 గంటలూ అందుబాటులో ఉంటుందని చెప్పారు. రాష్ట్రంలో పరిశ్రమలకు విద్యుత్తు, నీటి సమస్య లేదని, ఏ పరిశ్రమకు ఎలాంటి సమస్యా రానివ్వబోమని అన్నా రు. ఓఆర్అర్, ఆర్ఆర్ఆర్‌ల మధ్యలో ఫార్మా క్లస్టర్లు నిర్మించి పరిశ్ర మను ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. మాదా పూర్‌లోని హైటెక్స్‌లో మూడురోజుల పాటు కొనసాగే 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌ను శుక్రవారం మంత్రులు శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలసి ఆయన ప్రారంభించారు. ఆరోగ్య సంరక్షణకు ఫార్మా పరిశ్రమ వెన్నెముక లాంటిదని భట్టి పేర్కొన్నారు. అత్యధిక నాణ్యతతో జనరిక్ మెడిసిన్ ఉత్పత్తి చేసి ప్రపంచ వ్యాప్తంగా ఎగుమతి చేస్తూ తెలంగాణ గుర్తింపు సాధించిందన్నారు. కరోనా కాలంలో ఫార్మాసిస్టులు అసమానమైన చురుకుదనం ప్రదర్శించి అవిశ్రాంతంగా శ్రమించారని అభినందించారు. రాష్ట్రంలో కొత్త విద్యుత్ పాలసీని తీసుకురాబోతున్నట్టు భట్టి తెలిపారు. మిగులు విద్యుత్

(మిగతా 2వ పేజీలో)

# పవన్ వారాహి దీక్ష విరమణ




అమరావతి, జూలై 5 : సమాజ సంక్షేమాన్ని, దేశ సౌభాగ్యాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన వారాహి ఏకాదశ దిన దీక్ష... వారాహి అమ్మవారి ఆరాధన, కలశోద్వాసన క్రతువుతో పరిసమాప్తమైంది. ప్రదోష కాలాన వేద పండితులు మంత్రోచ్ఛారణల నడుమ దీక్షాబద్ధులైన పవన్ కల్యాణ్ వారాహి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏక హారతితో పాటు నక్షత్ర హారతులు అమ్మవారికి సమర్పించారు. చివరిగా హారతితో వారాహి ఏకాదశ దిన ఆరాధన సంపూర్ణం అయింది. వేద పండితులు బ్రహ్మశ్రీ కోసిగంటి సుధీర్ శర్మ, హరనాథ్ శర్మ, వేణుగోపాల శర్మ పూజాక్రతువు పూర్తి చేసి ఆశీర్వచనాలు అందజేశారు. ఇకపై పవన్ కల్యాణ్ చాతుర్మాస దీక్ష చేయనున్నారు. గృహస్తాచారరీతిలో ఈ దీక్షను తలపెడుతున్నారు. అధికార కార్యకలాపాలను కొనసాగిస్తూనే శుభతిథుల్లో మాత్రం దీక్షా వస్త్రాలు ధరిస్తారు.

# భయపడొద్దు.. రండి!

- జగన్ భూతాన్ని మళ్లీ రానివ్వం..
- ఎలా నియత్రించాలో తెలుసు
- పారిశ్రామికవేత్తలకు చంద్రబాబు భరోసా..
- ఆంధ్ర పునర్నిర్మాణమే ధ్యేయం
- ఆ దిశగానే ప్రధాని, కేంద్ర మంత్రులతో చర్చలు
- నా హయాంలోనే కియా వచ్చింది..
- ఈ ఐదేళ్లలో ఒక్క పరిశ్రమా రాలేదు
- ఇప్పుడు పలువురు సీఈవోలు సంప్రదిస్తున్నారు
- ఢిల్లీలో మీడియాతో సీఎం ఇష్టాగోష్టి

2లో



జనసముద్రం



# త్వరలో జాబ్ కేలండర్

ఏర్పడిన తర్వాత సుప్రీంలో ఉన్న పిటిషన్‌ను వెనక్కు తీసుకుని, పాత నోటిఫికేషన్‌ను రద్దు చేయడంతో పోస్టుల సంఖ్యను పెంచి కొత్తనోటిఫికేషన్ జారీ చేశామని తెలిపారు. 12 ఏళ్ల తర్వాత నిర్వహించిన గ్రూప్-1 పరీక్షకు 4 లక్షల మంది హాజరయ్యారని, ప్రిలిమ్స్‌ను పూర్తి చేశామని, నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రకారం 1:50 పద్ధతిలో మెయిన్స్‌కు ఎంపిక చేస్తున్నామని వివరించారు. ఇప్పుడు ఆ నిష్పత్తిని 1:100కు పెంచితే కోర్టులు జోక్యం చేసుకునే అవకాశముందని, అదే జరిగితే మళ్లీ నోటిఫికేషన్ నిలిచిపోతుందని చెప్పారు. నోటిఫికేషన్‌లోని నిబంధనల మార్పు న్యాయపరంగా చెల్లుబాటు కాదని, బయోమెట్రిక్ పద్ధతి పాటించలేదన్న ఏకైక కారణంతో హైకోర్టు గ్రూప్-1 పరీక్షను రెండోసారి రద్దు చేసిందని గుర్తు చేశారు. 1999లో యూపీపీఎస్సీ వర్సెస్ గౌరవ్ ద్వివేది కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా వారు ఉదహరించారు.

**గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగాల పెంపు సాధ్యం కాదు**

గ్రూప్-2, గ్రూప్-3 ఉద్యోగాల పెంపు అంశం కూడా సమావేశంలో చర్చకు వచ్చింది. పరీక్షల ప్రక్రియ కొనసాగుతున్నందున పోస్టులు పెంచడం ఇప్పుడు సాధ్యం కాదని, అలా జరిగితే అది నోటిఫికేషన్ ఉల్లంఘన అవుతుందని అధికారులు సీఎంకు వివరించారు. అప్పుడు కూడా కోర్టులు జోక్యం చేసుకునే పరిస్థితి ఉంటుందని తెలిపారు. కాగా గ్రూప్-2, డీఎస్సీ పరీక్షలు వెంటవెంటనే ఉండడంతో అభ్యర్థులు నష్టపోవాల్సి వస్తోందని విద్యార్థి సంఘాల నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. జూలై 17 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలున్నాయని, వెంటనే 7, 8 తేదీల్లో గ్రూప్-2 పరీక్ష ఉండడంతో విద్యార్థులు ప్రిపరేషన్‌కు ఇబ్బంది అవుతుందని వివరించారు. కాగా టీజీపీఎస్సీ, విద్యాశాఖలు చర్చించి ఈ విషయంలో తదుపరి నిర్ణయం తీసుకుంటాయని సీఎం వారికి హామీ ఇచ్చారు.

# పరిశ్రమలకు ఎలాంటి సమస్యలు రానివ్వం

అందుబాటులో ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

**ఆస్పత్రుల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి**

గ్రామీణ ఆస్పత్రుల అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిందిగా ఫార్మా దిగ్గజాలకు మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కంపెనీలు తమ సామాజిక బాధ్యత (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులు కేటాయించాలని కోరారు. హైదరాబాద్‌లో టిమ్స్, వరంగల్‌లో గవర్నమెంట్ సూపర్ మల్టీ స్పెషాలిటీ హస్పిటల్ రూ.8 వేల కోట్లతో నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే 40 శాతం పనులు పూర్తయ్యాయని చెప్పారు. నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచినట్టు తెలిపారు. ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ చైర్మన్ బి.పార్థసారథిరెడ్డి, భారత్ బయోటెక్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా, ఫార్మా కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ మొంటుకుమార్ పటేల్, డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా డాక్టర్ రాజీవ్ రఘువంశీ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. మొత్తం 8,500 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

**అమీన్‌పూర్‌లో ఫార్మా హెల్త్‌కేర్ ఐటీ హబ్ %-% పల్సస్ గ్రూప్ ప్రకటన**

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ట్రాన్స్‌ఫార్మేటివ్ ఏఐ డ్రివెన్ ఫార్మా హెల్త్‌కేర్ ఐటీ హబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పల్సస్ గ్రూప్ తెలిపింది. హైదరాబాద్‌లో జరుగుతున్న ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్‌లో ఈ మేరకు కీలక ప్రకటన చేసింది. ఏఐ ఫార్మా హబ్ ఏర్పాటుతో దాదాపు 10 వేల ప్రత్యక్ష ఉద్యోగాలను కల్పిస్తామని పేర్కొంది. అమీన్‌పూర్‌లోని ఐటీ/ఐటీఈఎస్ జోన్‌లో అద్భుతమైన మౌలిక వసతులు, రవాణా సౌకర్యాలు ఉండడం హబ్‌కు ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపింది. ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ సహా 1,400కు పైగా సైన్స్, టెక్నాలజీ, మెడికల్ జర్నల్స్‌ను ప్రచురించే గొప్ప వారసత్వంతో పల్సస్ గ్రూప్ సమాజానికి గణనీయమైన సహకారం అందిస్తోందని పేర్కొంది.

# లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు మరోసారి చుక్కెదురు..

హైదరాబాద్: రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ అంశాలపై శనివా రం సాయంత్రం ఆరు గంటలకు ప్రజాభవన్ వేదికగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల స్థాయిలో కీలక సమావేశం జరగనుంది. ఇరు రాష్ట్రాల్లోనూ కొత్త ప్రభుత్వాలు ఏర్పాటైన నేపథ్యంలో మరోసారి విభజన అంశాలపై చర్చలకు ఇరు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు సిద్ధమయ్యారు. ఈ భేటీలో ముఖ్యమంత్రులతో పాటు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఏపీ నుంచి మంత్రులు అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్ధన్‌రెడ్డి, కందుల దుర్గేబ్, ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఇతర శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు కూడా పాల్గొననున్నారు.

**కీలక అంశాలపై చర్చలు**

విభజన సమస్యలపై గతంలో అధికారుల స్థాయిలో దాదాపు 30 సమావేశాలు జరిగినా పెద్దగా ముందడుగు పడలేదు. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం తమ రాష్ట్ర ప్రయోజనాలకు పెద్ద పీఠ వేయడంతో సమస్యలు, అంశాలు పరిష్కారానికి నోచుకోలేదు. తాజా సమావేశంలో ప్రధానంగా షెడ్యూల్ 9, 10లోని సంస్థలు, వాటి ఆస్తులు, నగదు నిల్వల పంపకాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనున్నట్లు తెలుస్తోంది. ఏ రాష్ట్రంలో ఉన్న ఆస్తులు ఆ రాష్ట్రానికి చెందుతాయని కేంద్ర ప్రభుత్వం విస్పష్టంగా ప్రకటించినప్పటికీ.. ఆంధ్రప్రదేశ్ మాత్రం అలా కుదరదని, ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు వేలకోట్లతో హైదరాబాద్‌లో ఆస్తులు ఏర్పడ్డాయని, వాటిలో వాటా కావాలని డిమాండ్ చేస్తోంది. తెలంగాణ మాత్రం తమ భూభాగంలోని స్థిరాస్తుల్లో వాటా ఇచ్చే ప్రసక్తే లేదని వాదిస్తోంది. ఇక ఆర్టీసీ బస్‌భవన్, రాష్ట్ర ఆర్థికసంస్థ, ఉన్నత విద్యా మండలి, స్పోర్ట్స్ అథారిటీ ఆస్తులు, దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ల్యాండ్ హెూల్డింగ్స్, ఉద్యోగుల పరస్పరం బదిలీ అంశాలు కూడా ప్రస్తుత భేటీలో ప్రధానంగా చర్చకు రానున్నాయి.

**విద్యుత్ బకాయిల అంశం కూడా..**

ఇరు రాష్ట్రాల మధ్య విద్యుత్ బకాయిల అంశం కూడా ప్రధానంగా మారింది. తెలంగాణకు రావాల్సిన సీలేరును ఏపీకి కేటాయించడం వల్ల, అధిక ధరలకు విద్యుత్ కొనుగోళ్లు చేయడం వల్ల.. వేల కోట్ల రూపాయల భారం రాష్ట్రంపై పడిందని, ఆ మొత్తాన్ని ఏపీ చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తుంటే.. తెలంగాణకు విద్యుత్ సరఫరా చేసినందున అందుకు చెల్లించాల్సిన నిధులు ఇవ్వడం లేదని ఏపీ చెబుతోంది. దీనితో పాటు కృష్ణా జలాల పంపకంపై కూడా ప్రధానంగా చర్చ జరిగే అవకాశం ఉంది. గతంలో తాత్కాలిక పద్ధతిలో పంపిణీ చేసిన కృష్ణా జలాలను ఇప్పుడు 50 :50 చొప్పున పంపిణీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. మరోవైపు రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు చెందిన నిధుల వివాదం కూడా పరిష్కారానికి నోచుకోలేదని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

# ఆషాఢమాసం.. విశిష్టత



## నేటి నుండే ఆరంభం



జ్యోతిష్య శాస్త్రము దృష్ట్యా 12 తెలుగు మాసంలలో ఆషాడ మాసానికి ఒక ప్రత్యేకత ఉంది. కొత్తగా పెళ్లయిన స్త్రీ నెల రోజులపాటు తన అత్యంత నుండి పుట్టింటికి వెళ్లడంతో ఈ మాసానికి విశేష ప్రాచుర్యం ఉంది. ఆషాఢమాసాన్ని శూన్యమాసం అన్నారు. అందువల్ల వివాహాది శుభకార్యాలు చేయరు. కానీ ఈ మాసంలో అనేక పర్వదినాలు ఉన్నాయి. ఆషాఢ శుద్ధ పాడ్యమి మొదలుకొని వారాహి నవరాత్రి ఉత్సవములు ఏకాదశి విష్ణు ఆరాధనకు అత్యంత ముఖ్యమైన తిథి. దీనికి తొలి ఏకాదశి అని పేరు. తెలుగు సంప్రదాయం ప్రకారం ఇప్పటినుండి పండుగలు ప్రారంభమవుతాయి. ప్రతి వారానికి, ప్రతి 15 రోజులకొకసారైనా ఏదో ఒక పండుగ, వ్రతం, పూజ ఉంటుంది. తొలి ఏకాదశి నుంచి చాతుర్మాస్య వ్రతం ప్రారంభిస్తారు. దక్షిణాయనం ప్రారంభమయ్యేది ఈ మాసం లోనే. సూర్యుడు కర్కాటక రాశి ప్రవేశము జరిగిన రోజున దక్షిణాయన ప్రారంభము జరిగినట్లు అవుతుంది. ఈ సంవత్సరము జూలై 16 మంగళవారం రోజున రాత్రి 11 గంటలకు తొమ్మిది నిమిషములకు దక్షిణాయన పుణ్యకాలం ఆరంభమవుతుంది. ఆ మరునాడు ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని దానధర్మాలు ఆచరించడం పితృదేవతలకు తర్పణాలు వదలడం సంప్రదాయంగా కొనసాగుతుంది. ఆషాడమాసంలో అందరు గోరింటాకు తప్పక పెట్టుకోవాలని ప్రాచీన సంప్రదాయం. అయితే దీని వెనక శాస్త్రీయత దృక్పథం ఉందని ఆయుర్వేద శాస్త్రజ్ఞులు చెప్తారు. వర్షాకాలం ఆరంభంలో క్రిమి కీటకాదుల వల్ల వచ్చే రోగాల నుండి గోరింటాకు తగిన రక్షణ కల్పిస్తుంది అన్నది ఆయుర్వేద వచనం. ఆషాఢ పూర్ణిమే గురు పూర్ణిమ. వ్యక్తికి జ్ఞానజ్యోతిని చూపినవాడు గురువైతే, లోకానికి జ్ఞానరాశిని అందించిన మహానుభావుడు వేదవ్యాసుడు. వేదవ్యాసుడు పుట్టినరోజున గురుపౌర్ణమిను జరుపుకోవడం ఆనవాయితీ.గురు పూర్ణిమ రోజున వేదవ్యాస మహర్షిని తమ గురువులలో చూసి వారిని ఆరాధిస్తారు.

తెలంగాణలో గ్రామదేవతలకు ప్రతి ఇంటి నుంచి వైభవంగా నివేదన (బోనం) తీసుకెళ్ళి అర్పించి బోనాలు మొదలయ్యేది ఆషాఢంలోనే. పల్లెటూర్లలో పోచమ్మ బోనాలను ఈ మాసములో ప్రతి ఆదివారం చేస్తూనే ఉంటారు. సమస్త జగత్తుకు పరిపాలకుడైన పూరి జగన్నాధుడి రథ యాత్ర జరిగేది కూడా ఈ మాసంలోనే. అమ్మలుగన్న అమ్మ, ముగ్గురమ్మ మూలపుటమ్మ జగజ్జననీ సకల జీవులకు ఆహారం అందించిన శాకంబరీ దేవిగా దేశమంతటా దర్శనమిచ్చేది ఆషాఢం లోనే. ఈ మాసంలో శాకంబరీ నవరాత్రులు కూడా చేస్తారు. వైఖానస సంహిత ప్రకారం ఈ మాసంలో సప్తమాతృకలు , మహిషాసుర మర్దిని, దుర్గా దేవిని, భైరవ, వరహా, నారసింహుల యొక్క ఆరాధన తప్పక చేయాలి.

కొత్తగా పెళ్ళైన వధువును పుట్టింటికి తీసుకు వెళ్ళేది ఆషాఢ మాసంలోనే. ఆషాఢమాసంలో కొత్తగా పెళ్ళైన దంపతులను దూరంగా ఉంచుతారు. అమ్మాయిని పుట్టింటికి తీసుకువెళతారు. ఆషాఢమాసంలో స్త్రీ నెలతప్పితే, 9 నెలల తరువాత అంటే వేసవి కాలంలో (మార్చి నుంచి మే మధ్య కాలంలో) ప్రసవం జరుగుతుంది. సాధారణంగానే మన దేశంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. వేసవిలో మరింత విజృంభిస్తాయి. అప్పుడే పుట్టిన శిశువుకు ఈ వేడివాతావరణం బాగా ఇబ్బంది కలిగిస్తుంది. శిశువు ఆరోగ్యం మీద ప్రభావం చూపిస్తుంది. తల్లి ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. ఇది తల్లీబిడ్డల ఆరోగ్యానికి ఏ మాత్రం శ్రేయస్కరం కాదు. అందుకే ఆషాఢ మాసంలో కొత్త దంపతులను దూరంగా ఉంచుతారు. మాతశిశు సంక్షేమమే దేశ సంక్షేమానికి తొలి మెట్టు అన్నది మన పూర్వీకులు ఆలోచన. అందుకే ఈ సంప్రదాయం.

ఆషాఢమాసంలో తొలకరి మొదలై వర్షాలు పడతాయి. ఇంట్లో అందరు వ్యవసాయ పనుల మీద పొలానికి వెళ్ళినా , కొత్తగా పెళ్ళైన జంట కలిసి గడపటానికి ఇష్టపడతారు. వ్యవసాయ కుటుంబాల్లో అందరు కలిసి పని చేయకపోతే , చాలా ఇబ్బందులు పడవలసి వస్తుంది. అందుకే కొత్త కోడలిని పుట్టింటికి పంపేస్తారు. కొత్త అల్లుడు అత్తవారింటి గడప తొక్కకూడదన్న సంప్రదాయం కూడా ఇందుకే వచ్చింది.

శూన్యమాసం అంటే భయాలను కలిగించేందుకు వచ్చింది కాదు. శాస్త్రీయ కారణాల వల్ల ఈ మాసానికి శూన్య మాసమని మన పెద్దలు నిర్ణ యించి అటు సంప్రదాయానికి ఇటు శాస్త్రీయతకు వారధిగా నిలిపారు.

-డాక్టర్ కోహెడ ప్రసాదరావు శర్మ
జ్యోతిష పండితులు, సీనియర్ రిపోర్టర్

# భయపడొద్దు.. రండి!

## ఢిల్లీలో మీడియాతో సీఎం ఇష్టాగోష్ఠి



న్యూఢిల్లీ, జూలై 5 : గత ఐదేళ్లలో జగన్ దుష్పరిపాలన వల్ల రాష్ట్రానికి సరిదిద్దలేనంత నష్టం జరిగిందని, అమరావతి, పోలవరం విధ్వంసానికి గురయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. మళ్లీ జగన్ వస్తారేమోనని కొందరు భయపడుతున్నారని.. ముఖ్యంగా ఆ భూతాన్ని చూసి రాష్ట్రానికి వచ్చేందుకు పారిశ్రామిక వేత్తలు భయపడుతున్నారని తెలిపారు. అయితే దానిని ఎలా నియంత్రించాలో తమకు తెలుసని.. దాని గురించి భయపడాల్సిన అవసరం లేకుండా చేస్తామని స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం ఢిల్లీల్లో కేంద్ర ఆర్థిక, రక్షణ, ఆరోగ్య మంత్రులతో భేటీల అనంతరం.. హైదరాబాద్ బయల్దేరి వెళ్లే ముందు మధ్యాహ్నం 3 గంటలకు జాతీయ, ప్రాంతీయ మీడియాతో ఇష్టాగోష్ఠిగా ముచ్చటించారు. దాదాపు గంట సేపు మనసు విప్పి మాట్లాడారు. ఎవరు ఎన్ని వివాదాస్పద ప్రశ్నలు వేసినా తడుముకోకుండా చమత్కరిస్తూ సమాధానమిచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణమే ప్రధాన ఎజెండాగా తన రెండ్రోజుల పర్యటన సాగిందన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం పూర్తి చేయడంతో పాటు మొత్తం రాష్టాన్ని పునర్నిర్మించడమే ధ్యేయంగా ఢిల్లీలో ప్రధానమంత్రి, ఇతర కేంద్ర మంత్రులతో చర్చలు జరిపానని, అందరి నుంచీ సానుకూల స్పందన వ్యక్తమైందని చెప్పారు. గత ఐదేళ్లుగా జరిగిన నష్టం నుంచి బయటకు రావాలని, అందుకు అనుగుణంగా రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు సహకారం అందించాలని కేంద్రాన్ని కోరామని చెప్పా రు. ఏపీ గ్లోబల్ లీడర్‌గా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

**పదవులు మాకెప్పుడూ ముఖ్యం కాదు..**

టీడీపీకి పదవులు ఎప్పుడూ ముఖ్యం కాదని, వాజపేయి హయాంలో కూడా ఏడు మంత్రిపదవులు ఇస్తామన్నా వద్దన్నామని చంద్రబాబు తెలిపారు. ఎన్డీయేతో సత్సంబంధాల కోసమే బలవంతం మీద నాడు లోక్‌సభ స్పీకర్ పదవి తీసుకున్నామని చెప్పారు. అయితే అప్పటికీ, ఇప్పటికీ పరిస్థితులు మారాయన్నారు. కేంద్రంలో తమకు కేటాయించిన మంత్రి పదవుల పట్ల సంతోషంగా ఉన్నామని తెలిపారు. లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని కూడా కోరుకోవడం లేదని చెప్పారు. కావాలంటే నా తరఫున మీరు అడగండని చమత్కరించారు. బీజేపీ ఎజెండాకు తాము మద్దతిచ్చామని.. తమ ఎజెండాకు వారు మద్దతిచ్చారని.. రెండు పార్టీలు పరస్పర ఎజెండాలకు అనుగుణంగా పనిచేస్తాయని తెలిపారు. 2014లో మోదీతో ఉన్న సంబంధాలకు, ఇప్పటి సంబంధాలకూ తేడా ఏమిటని ప్రశ్నించగా.. ఆయన నేరుగా జవాబివ్వలేదు. 'నేను ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నప్పుడు మీరెలా చూశారు.. ఇప్పుడెలా ట్రీట్ చేస్తున్నారు? పరిస్థితులు మారాయి కదా..! ఇప్పుడు మేం కలిసి పని చేస్తాం' అని తెలిపారు. ఏపీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించామని మోదీ కూడా చెప్పారని గుర్తుచేశారు.

## లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కవితకు మరోసారి చుక్కెదురు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోసారి చుక్కెదురైంది. సీబీఐ కేసులో కవిత కస్టడీని జులై 18 వరకు పొడగిస్తూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించింది రౌస్ అవెన్యు కోర్టులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కవితను తిహార్ జైలు అధికారులు న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టారు. ఈ కేసులో విచారణ జరిపిన అనంతరం కవిత కస్టడీనీ జులై 18 వరకు పొడగిస్తున్నట్లు రౌస్ అవెన్యు కోర్టు న్యాయమూర్తి తెలిపారు. ప్రస్తుతం కవిత తిహార్ జైల్లో ఉన్నారు. అదే విధంగా ఈడీ కేసులోనూ కవిత జ్యుడిషియల్ కస్టడీని కోర్టు మరోసారి పొడిగించింది. ఆమెతో పాటు ఈ కేసులో ఉన్న ఆప్ నేత మనిష్ సిసోడియా కస్టడీని జులై 25వ తేదీకి పొడిగిస్తూ బుధవారం రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశాలిచ్చింది. కాగా, ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కవితను మార్చి 15న హైదరాబాద్‌లో ఈడీ అధికారులు అరెస్టు చేశారు. ఆ తర్వాత ఇదే కేసులో సీబీఐ అధికారులు కూడా విచారించారు. ఏప్రిల్ 11వ తేదీన ఢిల్లీ లిక్కర్ కేసులో కవితను సీబీఐ అరెస్ట్ చేసింది. ఈ రెండు కేసుల్లో ఆమెకు బెయిల్ తిరస్కరస్తూ న్యాయమూర్తి జ్యుడీషియల్ కస్టడీ పొడిగిస్తూ వస్తున్నారు.

## నేడు రేవంత్, బాబు భేటీ

### ప్రజాభవన్ వేదికగా తెలంగాణ, ఏపీ సీఎంల సమావేశం

హైదరాబాద్: రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ అంశాలపై శనివా రం సాయంత్రం ఆరు గంటలకు ప్రజాభవన్ వేదికగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల స్థాయిలో కీలక సమావేశం జరగనుంది. ఇరు రాష్ట్రాల్లోనూ కొత్త ప్రభుత్వాలు ఏర్పాటైన నేపథ్యంలో మరోసారి విభజన అంశాలపై చర్చలకు ఇరు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు సిద్ధమయ్యారు. ఈ భేటీలో ముఖ్యమంత్రులతో పాటు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఏపీ నుంచి మంత్రులు అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్ధన్‌రెడ్డి, కందుల దుర్గేబ్, ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, ఇతర శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు కూడా పాల్గొననున్నారు. విభజన సమస్యలపై గతంలో అధికారుల స్థాయిలో దాదాపు 30 సమావేశాలు జరిగినా పెద్దగా ముందడుగు పడలేదు. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం తమ రాష్ట్ర ప్రయోజనాలకు పెద్ద పీఠ వేయడంతో సమస్యలు, అంశాలు పరిష్కారానికి నోచుకోలేదు. తాజా సమావేశంలో ప్రధానంగా షెడ్యూల్ 9, 10లోని సంస్థలు, వాటి ఆస్తులు, నగదు నిల్వల పంపకాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనున్నట్లు తెలుస్తోంది.

## 'పీఎల్ఐ శాశ్వత సబ్సిడీ కాదు'

## డ్రోన్ పరిశ్రమ పురోగతికి ప్రభుత్వ సహకారం

డ్రోన్ పరిశ్రమ పురోగతికి కేంద్రం అందిస్తున్న ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక(పీఎల్ఐ) పథకం ఎంతో ఉపయోగపడుతోందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. అయితే ఈ పథకాన్ని ప్రభుత్వ శాశ్వత సబ్సిడీగా పరిగణించకూడదని స్పష్టం చేశారు. న్యూదిల్లీలో పీహెచ్‌డీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ నిర్వహించిన ఇంటర్నేషనల్ ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..'పీఎల్ఐ పథకాన్ని పరిశ్రమలు శాశ్వత సబ్సిడీగా పరిగణించకూడదు. ఆయా రంగాలను ఈ సబ్సిడీపై ఆధారపడేలా చేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదు. ఇది వాటి పురోగతికి అందించే ప్రోత్సాహకం మాత్రమే. డ్రోన్ పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ సాంకేతిక పురోగతి రైతులకు అధిక నాణ్యత గల పంటలను అందించాలి. పంటల దిగుబడిని పెంచేలా సహకరించాలి. అందుకు అనువుగా మరిన్ని పరిశోధనలు జరగాలి. గ్రామ స్థాయిలో డ్రోన్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసి మహిళా సాధికారత కల్పించేలా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అందుకోసం ప్రధానమంత్రి 'నమో డ్రోన్ దీదీ' పథకం ఎంతో ఉపయోగపడుతోంది. ఎన్‌డీఏ కూటమి మూడో టర్మ్ పరిపాలనలో మూడు రెట్లు వేగంతో పని చేస్తాం. మూడు రెట్ల ఫలితాన్ని అందిస్తాం. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తాం' అని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో బూర్గంపహాడ్ కనుమరుగు

**- ముంపు గ్రామాలకి దిక్కెవరు ?**

**- గ్రామానికి మూడు వైపుల కరకట్టతో తీవ్ర ప్రమాదం**

**- కే.వి రమణ బి ఆర్ ఎస్ నాయకులు**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గం పహాడ్ జనసముద్రం న్యూస్ (జూలై 05) పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే తెలంగాణ రాష్ట్రంలో పోలవరం వెనుక జలాల ప్రభావం మరియు ఉపనదుల వరద ఉధృతి కారణంగా బూర్గంపహాడ్ మండలంలో గోదావరి పరివాహక ప్రాంతంలో బూర్గంపహాడ్ గ్రామం పూర్తిగా మునిగిపోతుంది అదేవిధంగా మండలంలోని మరి కొన్ని గ్రామాలు నాగినేని ప్రోలు రెడ్డిపాలెం, సారపాక, మోతే తదితర గ్రామాలు తీవ్రమైన వరదముంపుని ఎదుర్కొనే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు . గోదావరి వరద ఉధృతి కారణంగా వ్యవసాయ పంటల మునకతో రైతులు వ్యాపారస్తులు , కూలీలు, సామాన్య జన జీవనం స్తంభించి దిక్కుతోచని పరిస్థితి దాపురిస్తుందని ప్రజలందరూ భయపడుతున్నారని పత్రికా ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. భద్రాచలం వైపు కరకట్ట నిర్మాణం శరవేగంగా జరుగుతున్నది ఇది పూర్తిగా అయితే బూర్గంపహాడ్ మండలంలోని ముంపు గ్రామాలకు వరద తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఆవేదన చెందారు. గతంలో బూర్గంపహాడ్ మండల గ్రామ ప్రజలు సమిష్టిగా రాజకీయ పార్టీల జేఏసీ ఆధ్వర్యంలో 2022 ఆగస్టు 19వ తేదీ నుండి బూర్గంపాడు మండలంలోని ముంపు గ్రామాలను పోలవరం ప్రాజెక్టు ముంపు బాధిత గ్రామాలుగా గుర్తించి 2013 భూసేకరణ చట్టాన్ని అనుసరించి పరిహారం అందించాలని 53 రోజులు నిరాహార దీక్షలు, ధర్నాలు రాస్తారోకోలు వంటి నిరసన కార్యక్రమాలు చేశామని గుర్తు చేసుకున్నారు . ప్రస్తుత రెవెన్యూ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి సమస్య పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు ప్రస్తుతం వీరు తెలంగాణ ప్రభుత్వంలో కీలక భూమిక పోషిస్తున్నారు కాబట్టి మా మండలంలోని ముంపు గ్రామాల సమస్యకు సత్వర శాశ్వత పరిష్కారం దొరుకుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు త్వరలో రాజకీయ జేఏసీ ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ మండల ముంపు సమస్య పరిష్కారం కోరుతూ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ని కలవనున్నట్లు తెలియజేశారు .ముంపు సమస్య దృష్ట్యా గత కేంద్ర ప్రభుత్వం కేంద్ర జల శక్తి మండలి , తెలంగాణ జల వనరుల శాఖ, ఆంధ్ర ప్రదేశ్ జల వనరుల శాఖ, పోలవరం ప్రాజెక్టు అథారిటీ లతో సంయుక్త కమిటీని నియమించి తెలంగాణ రాష్ట్రంలో ముంపు తీవ్రతను అంచనా వేసేందుకు ప్రయత్నం జరిగింది పత్రికలో వచ్చిన సమాచారం మేరకు ఆ నివేదికలు క్షేత్రస్థాయిలో ముంపు తీవ్రతను అంచనా వేయడంలో విఫలమైందని ప్రజలు బాహాటంగా విమర్శించారు . రేపు అనగ జూలై 6వ తేదిన ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు విభజన హామీల పరిష్కారం దిశగా జరుగు సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని పోలవరం కారణంగా ముంపును ఎదుర్కొంటున్న గ్రామాలకు శాశ్వత పరిష్కారంలో భాగంగా తెలంగాణలోని ముంపు గ్రామాలకు 2013 భూ సేకరణ చట్టాన్ని అనుసరించి పరిహారం అందించే విధంగా చర్చలు చేయాలని ప్రజలందరూ కోరుకుంటున్నారని ఈ సందర్భంగా తెలియజేశారు .

# కౌశిక్ రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం ఖబర్దార్ కౌశిక్ రెడ్డి

## దళిత బహుజన సంఘాల నాయకుల హెచ్చరిక..



కరీంనగర్ జిల్లా ఇంచార్జ్ చిగురుమామిడి మండలం జూలై 5:(జనసముద్రం న్యూస్)హుజురాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి జిల్లా పరిషత్ సమావేశములో మాజీ జడ్పీ ఫ్లోర్ లీడర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గీకురు రవీందర పై చేసిన అనుచిత వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ బేషరతుగా క్షమాపణ చెప్పాలని దళిత బహుజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కౌశిక్ రెడ్డి మాటలకు నిరసనగా చిగురుమామిడి మండల కేంద్రములో బస్టాండ్ వద్ద ధర్నా నిరహించి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి పార్లమెంటరీ విధానం మీద గౌరవం లేదని, వీధి రౌడీలా చిల్లర మల్లర మాటలు మాట్లాడుతున్నారన్నారు. బలహీన వర్గాలంటే చులకన భావమన్నారు. గీకురు రవీందర్ పోలీస్ నౌకరి వదిలి పెట్టి తెలంగాణ ఉద్యమం చేసినవాడని, కష్టపడి రాజకీయంగా ఎదిగి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడే నాయకుడని అన్నారు. ఉద్యమ కారుల మీద రాళ్లు రువ్వి, స్వార్థ రాజకీయం కోసం పదవుల పార్టీ మారిన చరిత్ర నీదని, ఉద్యోగాలు పెట్టిస్తానని డబ్బులు వసూలు చేసిన మోసకారివని దుయ్య బట్టారు. ఎమ్మెల్యేగా గెలిపించకుంటే కుటుంబ సభ్యులం సామూహికంగా విషం తాగి చస్తామని బ్లాక్ మెయిల్ చేసి గెలిచినోడివని ఏద్దేవా చేశారు. మా బహుజన బిడ్డకు బేషరుతుగా క్షమాపణ చెప్పకుంటే గ్రామల్లో తిరుగనివ్వమని, దళిత బహుజనులం నీ రాజకీయ గోరీ కడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బెజ్జంకి అంజయ్య, బోయిని వంశీకృష్ణ, జిల్లా ఫిషరీష్ డైరెక్టర్ జక్కుల బాబు, సొసైటీ అధ్యక్షులు చెరుకు సంజీవ్ ఠాకూర్ రాణా ప్రతాప్ సింగ్ కుమార్, గట్టు శ్రీనివాస్, పెసరు శ్రీనివాస్, దొబ్బల బాబు, బొమ్మగాని వెంకటేష్ గౌడ్, గందే రమేష్, కూరెళ్ళ కిషోర్, గట్టు రంజిత్, కూన బిక్షపతి, గట్టు సతీష్, గాజుల రాజు, పొగాకు రమేష్, గుజ్జుల రాజు, పొన్నం వెంకట్రాజయ్య, పొన్నం కనకయ్య, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# షీ టీం మీకోసమే



జనసముద్రం దినపత్రిక ప్రతినిధి, జులై 5, షీ టీం ఉన్నది మీకోసమే అని షీ టీం ప్రత్యేక పోలీసులు అన్నారు. శుక్రవారం రోజున తాండూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తాండూర్ లో విద్యార్థులకు, సిబ్బంది కి మహిళలకు మరియు పిల్లల పై జరుగుతున్న లైంగిక నేరాలకు తీసుకోవలసిన జాగ్రత్తల పై తాండూరు పోలీసుల తో కలిసి అవగాహన కల్పించిన మంచిర్యాల జిల్లా షి టీమ్ అధికారులు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మహిళలు, పిల్లల రక్షణ భద్రత షీ టీమ్స్, భరోసా సెంటర్లు పనిచేస్తున్నాయని తెలిపారు. ర్యాగింగ్,ఈవ్ టీజింగ్, పోక్సో, గుడ్ టచ్,బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు,వరకట్నం చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పిల్లలు మహిళలను ఇబ్బందులకు గురి చేసేవారిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత దగ్గరై సేవలు అందిస్తు న్నామని ఏదైనా సమస్య ఉంటే డయల్ 100 కాల్ చేయాలని, స్థానిక పోలీస్ అధికారులకు తెలియజేయాలని ర్యాగింగ్ ఈవ్ టీజింగ్ లైంగికంగా వేధించటం వెంటపడటం ఇటువంటివ్యక్తులపై నిఘా ఉంటుంది అన్నారు. లైంగికంగా వేధిస్తే ఎవరైనా భయ పడకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలని, కొత్త వారిని గుడ్డిగా నమ్మవద్దని అప్ర మత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక దురాచారాల నిర్మూలన, గ్రామీణ వాతావరణ విశిష్టత, కుటుంబ అనుబంధాలు, సైబర్ నేరాలపై, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ డయల్ 1930 కి మరియు రామగుండం షి టీమ్ నంబర్ 6303923700 లో సంప్రదించాలన్నారు. మహిళల గురించి ప్రత్యేక రక్షణ చర్యలు చేపడుతున్నామని, ట్రాఫిక్ నియమాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో తాండూరు ఎస్సై చంద్ర మిస్త్రి, హెడ్ కానిస్టేబుల్ స్వామి దాస్,షి టీమ్ సిబ్బంది మహిళా కానిస్టేబుల్ జ్యోతి,కానిస్టేబుల్స్ శ్రావణ్ కుమార్,సతీష్ స్కూల్ హెడ్ మాస్టర్ శ్రీనివాస్, ఇంచార్జి హెడ్ మాస్టర్ అజీమ్, టీచర్ మ్యకం రమేష్, పాల్గొన్నారు.




## కాంగ్రెస్ ప్రభుత్వం చేపించే అక్రమ అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదు

జన సముద్రం న్యూస్ జమ్మికుంట జూలై 5:

జమ్మికుంట పట్టణంలోని వివిధ ఆర్గనైజేషన్ల నాయకులను నిన్న అర్ధరాత్రి నుంచి అక్రమ అరెస్టులు చేపడుతున్నారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు కూడా జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోవడం సిగ్గుచేటు అని అన్నారు ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయకపోవడమే కాకుండా ఈరోజు ఉద్యోగాలు రాని నిరుద్యోగులు మరియు వివిధ ఆర్గనైజేషన్ల నాయకులు కలిసి ప్రశ్నించడానికి వెళుతుంటే యావత్ తెలంగాణ నలుమూలల నిరుద్యోగులను వివిధ ఆర్గనైజేషన్ నాయకులను అక్రమ అరెస్టులు చేయడం ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంప పెట్ అని అన్నారు. రేవంత్ రెడ్డి గారు మీకు నిరుద్యోగులు వివిధ ఆర్గనైజేషన్ నాయకులన్న ఎందుకు ఇంత భయం మీరు ఎన్ని అక్రమ అరెస్టులు చేపించిన ఎంతమందిని జైల్లో పెట్టిన వెనక్కు తగ్గే ప్రసక్తి లేదు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి వణుకు పుట్టేలా ఉద్యమాలు కొనసాగుతాయని హెచ్చరిస్తా ఉన్నాము అని అన్నారు. అరెస్ట్ అయిన వారిలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చేలుపూరి రాము, బి ఆర్ ఎస్వి టౌన్ అధ్యక్షులు కొమ్ము నరేష్, సామాజిక కార్యకర్త గట్టు సాయిరాం, పసునూటి వెంకటేష్ కెన్ని, కొత్త గణపతి రెడ్డి, డివైఎఫ్ఐ జమ్మికుంట అధ్యక్షులు కరంకొండ శ్రావణ్ కుమార్. నాయకులు పాల్గొన్నారు




## చెట్లను నాటుదాం- పర్యావరణాన్ని కాపాడదాం- జీవన ప్రమాణాన్ని పెంచుకుందాం -మార్క అనిల్ గౌడ్

జన సముద్రం న్యూస్ హుస్నాబాద్ జూలై 5: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో చెట్లు నాటే కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్క అనిల్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మనకు ప్రాణవాయువును అందించడంతోపాటు సకాలంలో వర్షాలు పడడానికి, సకల జీవరాశులను కాపాడడానికి చెట్లను సంరక్షించడం తోపాటు ప్రతి సంవత్సరం ప్రభుత్వం చేపట్టే వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెట్లు నాటి ప్రకృతి రక్షణలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి పృథ్వీరాజ్, గ్రామ నాయకులు దేవసాని నరసింహ రెడ్డి, కర్ర రవీందర్, గాలిపల్లి శ్రీనివాస్ శ్రీనివాస్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ మార్క శైలజ, శ్రీనివాస్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## శ్రీ శివశంకర మహామ్మాయి దేవాలయంలో ప్రతేక పూజలు,అన్న ప్రసాద వితరణ.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, ఉప్పల్ ప్రతినిధి, జనసముద్రం దినపత్రిక జులై 05:-ఉప్పల్ మున్సిపల్ పరిధిలోని శ్రీ శివశంకర మహామ్మాయి దేవాలయంలో జేష్ఠ మాస అమావాస్య సందర్భంగా శ్రీ మహామ్మాయి దేవి ప్రత్యేక అలంకరణ మరియు అన్న ప్రసాద వితరణ జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అథితి గా మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు శ్రీ ఈటెల రాజేందర్ గారు పాల్గొన్నారు, ఉప్పోజి బలవంత చారి.గారిని పూర్ణకుభం తో స్వాగతం పలికి, శాలువతో సన్మానం చేసినారు.. ఈ కార్యక్రమం లో రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షులు లలుకోట వెంకటా చారి,మాజీ %మీూా% బేతి సుభాష్ రెడ్డి,ఉప్పోజి రాజు గొపాల్ చారి,శ్రీనివాస్,మధు,పల్లెర్ల గోపి,చోల్లెటి బ్రహ్మ చారి,పురుషోత్తమ చారి, శ్రీనివాస్, శ్రీధర్, రాజ మలేష్ చారి,చంద్రమౌళి,రావిందర్ రెడ్డి, శమిర్ పేట ధర్మ రెడ్డి, హనుమంతు రెడ్డి, ఫణెందర్,బొంగు రమేష్ గౌడ్, పి.రామేశ్,సుగ్రీవ చారి,పాపి రెడ్డి,గోపాల్ రెడ్డి,మమిడ్ల బాల్ రాజు,తీగ విఠల్ రావు, గౌరిగె వెంకటేశ్,, సురేష్,నర్సింహా చారి,మహేష్ చారి, ప్రకాశ్,ఎసురి యాదగిరి,బజారు జగన్నాథ్ గౌడ్,అనిల్ రెడ్డి,దువ్వల రామేష్,రాం ప్రకాష్, రాజు ,రమేష్, చారి,గుముడెల్లి క్రిష్ణ,సంతొష్,సాయి,నర్సింగ్ రావు,మల్లేశ్,సుత్తి రెడ్డి,పాపయ్య గౌడ్,శివ కుమార్,ముదిగొండ రావి, అంజిరెడ్డి,కృష్ణ,చారి,శ్రీనివాస్ రావు,బాల్ రాజు, కృష్ణ, మొహన్,క్రిష్ణ రెడ్డి,పసుపు నెటి రమేష్,పవన్ కుమార్,వెంకటేశ్,భవాని శంకర్, సాయిరాం, సంతోష్, తదితర భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



## స్పెషల్ పార్టీ, డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు

జనసముద్రం దినపత్రిక ప్రతినిధి, జులై 5, మంచిర్యాల జిల్లా తాండూరు మండలంలోని మాదారం త్రీ గ్రామంలో శుక్రవారం రోజున ఉదయం ఐదు గంటల సమయంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ డాగ్ స్క్వాడ్ తో విస్తృత తనిఖీలు నిర్వహించారు. కార్డెన్ సర్చ్ లో భాగంగా ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ద్విచక్ర వాహనాలు 41,ఆటోలు 16, అదుపులోకి తీసుకొని రిజిస్ట్రేషన్ పేపర్లను పరిశీలించారు. వయస్సు నిండని అబ్బాయిలకు బండ్లు ఇవ్వకూడదని ఏదైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రుల పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ,సైబర్ క్రైమ్స్, షీ టీమ్స్, 100 డయల్, కొత్త చట్టాలపై, వాహనాల జరిమానాలు పెరిగిన వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఎస్సైలు, ఏఎస్ఐలు ,హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుల్లు పాల్గొన్నారు.



## మార్నింగ్ వాక్ లో పాల్గొన్న హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్...వాకర్స్ సౌకర్యార్థం ట్రాక్ ఏర్పాటుకు హామీ

జన సముద్రం న్యూస్ ప్రతినిధి హుజురాబాద్ జూలై 5:హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఈరోజు శుక్రవారం ఉదయం హుజురాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో మార్నింగ్ వాక్ లో పాల్గొని వాకర్స్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హుజురాబాద్ హై స్కూల్ గ్రౌండ్ లో ప్రతినిత్యం వందలాదిమంది ప్రజలు వాకింగ్ చేస్తూ ఉంటారని, వారి సౌకర్యార్థం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని లైటింగ్, డ్రైనేజీ వ్యవస్థను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆదే విధంగా వారు చెప్పిన ప్రతి సమస్యను తప్పకుండా పరిష్కరిస్తాననీ ప్రణవ్ పేర్కొన్నారు. హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి వొడితల ప్రణవ్ అన్నారు.ఈ సందర్భంగా పలువురు వాకర్స్ గ్రౌండ్ సంబంధించిన సమస్యలను ప్రణవ్ కి వివరించారు. డ్రైనేజీతో పాటు ట్రాక్ ఏర్పాటు చేయాలని అదేవిధంగా వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి అన్ని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కొల్లూరి కిరణ్ కుమార్, సోల్లు బాబు, కొలిపాక శంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్లూరి విజయ్ కుమార్, ఖాజీపేట శ్రీనివాస్, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మిడిదొడ్డి రాజు, హుజురాబాద్ యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రెసిడెంట్ చల్లూరి రాహుల్, మిడిదొడ్డి శ్రీనివాస్, సొల్లు ధశరథం, తాళ్ళపెల్లి రమేష్, ప్రతాప్ నాగరాజు, కందుల సందీప్, సదానందం, కె.ఆర్, మంద సాయి, గణేష్, రమేష్, రాఘవేంద్ర, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గోవర్ధన్, శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 30సం"ల దండోరా రజితోత్సవాలకు వేలాదిగా తరలిరండి

**జులై 7 తేదీ నాటికి 30 సంవత్సరాలలోకి అడుగుపెడుతున్న ఎమ్మార్పీఎస్ ఉద్యమం.**

**మాదిగ మాదిగ ఉపకులాల వర్గీకరణకై తరలి రండి**

**తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య పిలుపు**




ఎల్కతుర్తి జులై 5 జన సముద్రం న్యూస్:హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో నిర్వహించిన తెలంగాణ ఎమ్మార్పీఎస్ మండల సమావేశంలో ముఖ్యఅతిథిగా వచ్చినటువంటి తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సాతూరి వెంకన్న మాదిగ పాల్గొని మాట్లాడుతూ ఎస్సీలను ఏబిసిడిలుగా చేయాలని ప్రధాన డిమాండ్ తో రాష్ట్రంలో ఉమ్మడి రాష్ట్రంలో భారత దేశంలో గొప్ప చారిత్రాత్మక ఉద్యమం నడిపింది ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంతో ఎంతోమంది మాదిగ బిడ్డలు తమ తమ ప్రాణాలు సైతం లెక్క చేయకుండా అమరులైనారు అమరులైన వారిలో సురేందర్ మాదిగ దామోదర్ మాదిగ మహేష్ మాదిగ భారతి మాదిగ లాంటి 12 మంది ఉద్యమంలో అసువులు బాసారని వేలాదిమంది జైలు పాలై కేసులలో ఇప్పటికీ కోట్ల చుట్టూ తిరుగుతూనే ఉన్నారని ఇలాంటి కుల ఉద్యమంలో మహోన్నోత్తమైన కులం ఉద్యమముగా వీరజిమ్మింది మాదిగ దండోరా (ఎమ్మార్పీఎస్) అదేవిధంగా మాదిగ అమరవీరులను స్మరించుకుంటూ వారి త్యాగాలను నెరవేర్చుకుంటూ ఇప్పటికీ ఏదో ఒక పల్లె ఒక మూలాన ఒక జిల్లాలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ పేరు మీద సమావేశాలు సదస్సులు జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని ఎండగడుతూనే ఉన్నామని మాదిగలంతా కలిసి పోరాటాలు చేస్తూనే సామాజిక ఉద్యమాల్లో అన్ని వర్గాలకు న్యాయం జరిగే విధంగా పోరాటాలు కొనసాగిస్తూనే తెలంగాణ ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని వర్గీకరణ సాధించే లక్ష్యంగా ముందుకు కొనసాగిస్తూ 30వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో ఇప్పటికైనా పాలకులు వారి యొక్క స్వార్థం రాజకీయాల కోసం సంఘాలను నాయకులను వాడుకుంటూనే ఉన్నారని వారికి దాసోహం పలికినప్పుడు వర్గీకరణను 100 రోజులలో అయ్యేది సంవత్సరాలు గడిచిపోతుందని తెలంగాణ రాష్ట్రంలో నూటికి 70% మాదిగలు ఉన్నారు అని పదవులు ఉద్యోగాలు అవకాశాలు పొందే కాడ ఎక్కడో దూరంగా నెటవేయబడుతున్నారని ఉదాహరణకు మొన్న జరిగిన పార్లమెంట్ మరియు యూనివర్సిటీలలో వీసీ పోస్టులను ఉన్నత విద్య మండలి చైర్మన్ వంటివి కానీ గ్రూప్ వన్ గ్రూప్ టూ లలో అవకాశాలు పొందే కాడ మాదిగలకు ఎంతో తీరని అన్యాయం జరిగిందని ఈ అన్యాయాన్ని గురించి ఇది అన్యాయమని రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసి కూడా ఎవరి జనాభా దామాషా ప్రకారం గా వారి వాటా పంచాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకునే కాడ లేదు మన దేశంలో ఇప్పటికీ జనాభా నిష్పత్తి ప్రకారము రాజకీయ ఉద్యోగ అవకాశాలు రావలసిన అవకాశాలను పొందుపరుస్తున్నారు కానీ ఈ రాష్ట్రంలో అలాంటివి జరగడం లేదు సమాన అవకాశం కోసం పుట్టిన దండాలు ఉద్యమం ఈ అవకాశాలు పొందే కాడ దూరంగా ఉంటున్నామని దయచేసి విద్యావంతులు మేధావులు ప్రొఫెసర్లు లాయర్లు డాక్టర్లు ఇంజనీర్లు టీచర్లు కుల సంఘాలు నడిపే నాయకులు మొదట్లో ఎట్లైతే కుల సంఘాలు ప్రజాసంఘాల మద్దతు తీసుకొని పోరాటాలు నడిపారు ఇప్పటికీ కూడా మాదిగ అమరవీరుల సాక్షిగా అందరు కలిసి ఎస్సి వర్గీకరణ డిమాండ్ ఒకటే ఎజెండా ఒకటే నిదానం ఏబిసిడి ల వర్గీకరణ నినాదానికి అందరూ కలిసి రావలసిన అవసరం ఈ తరుణంలో ఎంతో ఉందని ప్రతి ఒక్కరిని గుర్తు చేస్తూ మేడి పాపయ్య మాదిగ తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నాయకత్వంలో 30 సంవత్సరాల దండోరా ఉత్సవాలకు ఘనంగా జయప్రదం చేయడానికి జులై 7వ తేదీ రవీంద్రభారతిలో జరిగే మాదిగ మృత వీరులను వారి కుటుంబాలను సన్మానించుకోవడం జరుగుతుంది కావున ప్రతి గ్రామం నుండి ప్రతి పల్లె నుండి పదిమంది చొప్పున హాజరై వర్గీకరణ ఉద్యమం కోసం జరుగుతున్న సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో తెలంగాణ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు సాతూరి రాజమౌళి బొక్క రాజు తుమ్మ రాజ్ కుమార్ రేణిగుంట్ల సాంబయ్య అరుణ్ తదితరులు పాల్గొన్నారు..



## నూతన పిఆర్ సి ని వెంటనే ప్రకటించాలి..

## తాప్ర కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్

జూలై 5: 2024హుజూరాబాద్ జన సముద్రం న్యూస్ ప్రతినిధి: నూతన పిఆర్ సి ని వెంటనే ప్రకటించాలని తాప్ర కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సైదాపూర్ రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర మ్యారేజ్ బ్యూరో కార్యాలయంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ తాప్ర హుజురాబాద్ శాఖ ఆధ్వర్యంలో చొల్లేటి మల్లారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాప్ర కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్ మరియు గౌరవ అధ్యక్షులు కట్ట నాగభూషణచారి హాజరై వారు మాట్లాడుతూ జూలై 2022 నుండి జనవరి 2024 వరకు పెండింగ్ లో ఉన్న 4 డి ఎ లను మరియు నూతన పి ఆర్ సి ని వెంటనే ప్రకటించి, జూలై 2023 నుండి పెన్షనర్లకు మరియు ఉద్యోగులకు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదే విధంగా ప్రతి జిల్లాలో రెండు వెల్ నెస్ సెంటర్ లను ఏర్పాటు చేస్తూ%ా%ఇ హెచ్ ఎస్ స్కీం ను అమలు పరుస్తూ పెన్షనర్ల కొరకు ప్రత్యేక డైరెక్టరేట్ ను వెంటనే ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బొంగోని వెంకటయ్య, సయ్యద్ మునీరుద్దీన్, హుజురాబాద్ శాఖ ప్రధాన కార్యదర్శి చీకట్ల సమ్మయ్య, కోశాధికారి మండల వీరస్వామి, జమ్మికుంట శాఖ అధ్యక్షులు గరిగె చంద్రయ్య, కార్యవర్గ సభ్యులు రామ కిష్టయ్య, పరాంకుశం సనత్ కుమార్, గాజె గంగయ్య, దొంత హరికిషన్, రాజిరెడ్డి, రామకిష్టం తదితరులు పాల్గొన్నారు.

# గుడుంబా రహిత జిల్లాను చూడబోతున్న మహబూబాబాద్ జిల్లా ప్రజలుజిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ జులై 5 గుడుంబా స్థావారాలపై వరుస దాడులతో చెక్ పెడ్తున్న మహబూబాబాద్ జిల్లా పోలీస్ యంత్రాంగంగుడుంబా పూర్తి నిర్మూలన పై మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ చేస్తున్న దాడుల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామ ప్రజలు. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా అన్ని పోలీస్ స్టేషన్స్ పరిధిలో గుడుంబా రైడ్స్ నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు. మహబూబాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా గుడుంబా సావరాలపై దాడులు నిర్వహించారు.మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ నుండి అధికారులు సిబ్బంది కలసి గుడుంబా స్థావారాలపై దాడులు నిర్వహించారు.ఈ దాడులలో జిల్లా పరిధిలో 31 కేసులు నమోదు చేయడం జరిగింది.అలాగే 287 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని, నల్ల బెల్లం 210 కేజీలు, 5240 లీటర్ల చెక్కెర పానకాన్ని ధ్వంసం చేసినట్లు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఐపీఎస్ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా జరిపిన ఈ దాడులలో డిఎస్పీలు , సీఐలు , ఎస్.ఐలు మరియు సిబ్బంది కలిపి 126 మంది పాల్గొన్నారు. మహబూబాబాద్ జిల్లా లో గుడుంబా స్తావరాలకు చోటు లేదన్నారు.ఎవరైనా అక్రమంగా గుడుంబా తయారీ చేసినట్లయితే వారిని బైండోవర్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.గుడుంబాకు అలవాటు పడి ఎంతోమంది కుటుంబాలను చిన్నబిన్నం చేసుకొని చివరకి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు.అంతే కాకుండా మీ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఎవరైనా గుడుంబా తయారీ చేస్తునట్టు తెలిసిన అమ్మిన వెంటనే దగ్గరలోని పోలీసు స్టేషన్ లో సమాచారం అందించాలని కోరారు. వారి వివరాలు గొప్యంగా ఉంచడం జరుగుతుందని అన్నారు. ఇక పై గుడుంబా రహిత జిల్లా గా మానుకోట ఉండబోతుందని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు.





## ఆసుపత్రులలో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలి:

## జిల్లా వైద్య ఆరోగ్యశాఖాదికారి డాక్టర్.బి.కళావతి భాయి

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ జులై 5 శుక్రవారం జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. కళావతి భాయి మహబూబాబాద్ పట్టణంలోని అమ్మ హాస్పిటల్ ను ఆకస్మికంగా తనిఖీ చేయడం చేసి రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు.ధరల పట్టిక, అర్హత లేని సిబ్బందితో హాస్పిటల్ నడుపుచున్నందుకు, పరిశు భ్రతగా లేకుండా నడుపుతున్నందుకు గాను నోటీసులు ఇవ్వడం జరుగుతుందని, తెలంగాణ రాష్ట్ర క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం ప్రకారం ప్రతి హాస్పిటల్ మేనేజ్మెంట్ వారు కూడా దరల పట్టికను, డాక్టర్ల వివరాలను ప్రదర్శించాలని, ఫైర్ సేఫ్టీ మెజర్స్ కు సంభందించిన పరికరాలను అమర్చుకోవాలని, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్మెంట్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రమాణాలను పాటించాలని, ప్రతి హాస్పిటల్ కు వాహనాలు నిలుపుట కొరకు పార్కింగ్ స్థలము తప్పకుండా ఉండవలెనని లేనియెడల చట్ట ప్రకారము చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.ఈ తనిఖీలో హెల్త్ ఎడ్యుకేటర్ మహేందర్ రెడ్డి, మంగమ్మ, ఇంచార్జి డి పి హెచ్ ఎన్ ఒ తదితరులు పాల్గొన్నారు

## గ్రామస్థాయిలో విద్య, వైద్యం,వ్యవసాయం, బలోపేతానికి సంబంధిత అధికారులు కృషి చేయాలి,

### అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ జూలై 5 శుక్రవారం నాడు, మహబూబాబాద్ జిల్లా గంగారం మండల కేంద్రం రైతు వేదికలో సంపూర్ణత అభియాన్ పథకం (నీతి అయోగ్) ద్వారా నిర్వహించే కార్యక్రమంలో లిముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) లేనిన్ వత్సాల్ టోప్పో పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పథకంలో భాగంగా ఎంపికైనందున, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మూడు నెలల వ్యవధిలో క్షేత్రస్థాయిలో (5) థీమ్స్ హెల్త్ అండ్ న్యూట్రిషన్, విద్య, వ్యవసాయం, అంతర్గత అభివృద్ధి, తదితర అంశాలపై (40) ఇండికేటర్స్ లలో సంబంధిత శాఖలు సమన్వయంతో అన్ని ప్యారామీటర్స్ లలో లక్ష్యాల సాధనకు పనిచేయాలనీ తెలిపారు, అంతక ముందు కస్తూరిబా , ట్రైబల్ వెల్ఫేర్, హాస్టలను తనిఖీ చేసి పిల్లలతో మాట్లాడారు, త్రాగు నీరు, మరుగు దొడ్లు, కరెంట్, ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలన్నారు, గంగారం రైతు వేదిక ఆవరణంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్క నాటారు, రైతు వేదిక ఆవరణంలో వైద్య ఆరోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వ్యవసాయ, ఐకెపి, శాఖ, తదితర శాఖలు ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి గర్భిణీ స్త్రీలు, పిల్లలు, పోషక ఆహారాలపై వివిధ స్కిట్ రూపకాల ద్వారా ప్రదర్శనలు ఇచ్చారు, విద్య, వైద్యం,



అంగన్వాడి, సేవల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను, పిల్లలను సన్మానించారు,ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ నర్మదా, వ్యవసాయ శాఖ ఏడి అభిమన్యుడు, హార్టికల్చర్ ఏడి మరియాన్న, డిపిఓ హరిప్రసాద్, ఐసిడిఎస్ పిడి వరలక్ష్మి, ఉపవైద్యాధికారి డాక్టర్ అంబరీష్, ఎంపీడీవో అప్పారావు, ఏబిఎఫ్ శ్రీనాథ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు..

# విద్యుత్ సరఫరాకు అంతరాయం

జనసముద్రం : జూలై 5 ( పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ )తేదీ: 06-07-2024, శనివారం రోజున పెద్దపల్లి టౌన్ -2 (శాంతి నగర్) సెక్షన్ పరిదిలో గల ఈ క్రింది ప్రదేశాలలో ఉదయం 8.00 గంటల నుండి 10.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడును విద్యుత్ లైన్ లకు తాకే చెట్ల కొమ్మలు తొలగించుట కొరకు మరియు విద్యుత్ లైన్లో మరమ్మతుల కారణంగా పెద్దపల్లి లోని నల్ల పోచమ్మవాడ, తెనుగువాడ, చింతల వాడ, మసీద్ ఏరియా, బండారి కుంట, అమర్ నగర్, ప్రగతి నగర్, మీషన్ హై స్కూల్ ఏరియా, క్రిస్టెయిన్ కాలనీ, టీచర్స్ కాలనీ, లలో విద్యుత్ సరఫరా ఉండదని తెలియజేస్తూ అందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించగలరని ఎం.సత్యనారాయణ సహాయక డివిజనల్ ఇంజనీర్ ఆపరేషన్/పెద్దపల్లి తెలిపారు.




# ముదిగొండలో ఉచిత కంటి వైద్య శిబిరం

**130 మందికి ఉచితంగా కంటి పరీక్షలు**

**20 మందికి శాస్త్ర చికిత్స కోసం గుర్తింపు**

**గ్రామీణ ప్రాంతాలలో లయన్స్ క్లబ్ వైద్య సేవలు**

**లయన్స్ క్లబ్ అధ్యక్షులు వస్కుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం**

జన సముద్రం ప్రతినిధి దేవరకొండ జులై :5గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ వారికి బాసటగా నిలవడమే లయన్స్ క్లబ్ ముఖ్య ఉద్దేశమని దేవరకొండ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ వస్కుల సత్యనారాయణ అన్నారు. గురువారం ముదిగొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 130 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా 20 శాస్త్ర చికిత్స చేయడానికి గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో కంటి ఆపరేషన్లకు 50 వేల నుండి 60 వేల రూపాయల వరకు ఖర్చు అవుతుందని నేరుగా బస్సులో హైదరాబాద్కు తీసుకెళ్లి అక్కడ శాస్త్ర చికిత్స చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఖరీదైన వైద్యం కార్పొరేట్ ఆసుపత్రుల్లో చేయించుకోలేక పేదలకు పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సామాజిక సేవ ఉద్దేశంతో లయన్స్ క్లబ్ ఉచితమేగా కంటి చికిత్స శిబిరాలను నిర్వహిస్తుందని తెలిపారు. అలాంటిది ఉచితంగా కంటి శాస్త్ర చికిత్స చేయించి చేయించిఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ లయన్ వస్కుల సత్యనారాయణ సెక్రెటరీ ట్రెజరర్ చిలుకూరి నిరంజన్, జోన్ చైర్మన్ వనం బిక్షమయ్య, డిసి పగిడిమర్రి శ్రీనివాసులు ,వనం శ్రీనివాసులు, లకుమారపు మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



## నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్'

## అఖిల భారత విద్యార్థి పరిషత్ దేవరకొండ శాఖ

జన సముద్రం ప్రతినిధి దేవరకొండ జులై :5అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ రాష్ట్ర శాఖ ఎలాంటి నిరసన ల కు కానీ ధర్నాలకు పిలుపు ఇవ్వక పోయినా ప్రభుత్వం మారింది కానీ, ప్రభుత్వ తీరు మారలేదు అక్రమ అరెస్ట్ లు ఆగలేదు. ఏ బి వి పి దేవరకొండ కార్యకర్తలను ఉదయం పోలీసులు అరెస్ట్ చేసి చందంపేట పోలీస్ స్టేషన్ మరియు దేవరకొండ పోలీస్ స్టేషన్ లో ఉంచడం జరిగింది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని ఏబీవీపీ సభ్యులు యలమల గోపీచంద్ ప్రభుత్వంపై మండిపడ్డారు. దేవరకొండ మండల కేంద్రంలో ఏబీవీపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఉద్యోగాల పేరుతో ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తుందని ఆరోపించారు మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవర్గ సభ్యులు ముదిగొండ అరవింద్, సైదులు, ఎయిర్టెల్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



## పూరి జగన్నాథ్ రథయాత్ర కమిటీ సమావేశం

## శ్రీ కృష్ణుడి రథయాత్ర విజయ వంతం చేయాలి

జన సముద్రం ప్రతినిధి దేవరకొండ జులై :5 అయ్యప్ప స్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పూరి జగన్నాథ రథయాత్ర కమిటీ కో చైర్మన్ చిలువేరు చంద్రమౌళి గారు మాట్లాడుతూ7వ తారీఖు ఆదివారం సాయంత్రం 4 గంటలకు పూరి జగన్నాథ్ రథయాత్ర విజయవంతంగా నిర్వహించాలని బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది కావున హిందూ బంధువులు మరియు రథయాత్ర కమిటీ సభ్యులు మహిళా కమిటీ సభ్యులు ప్రజలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారన్నారు ఈ కార్యక్రమంలో రథయాత్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నక్క వెంకటేష్ యాదవ్, కోశాధికారి పెండ్కర్ నాగేశ్వరరావు , సంస్కృతిక కార్యదర్శి నీల సంజీవ, మహిళా కమిటీ చైర్మన్ చెరుపల్లి జయలక్ష్మి, కో చైర్మన్ గోవింద్ శైలజ, కార్యదర్శి మోర శ్రీదేవి, కోశాధికారి బెలిదే మాధవి తదితరులు పాల్గొన్నారు

# మల్కాజ్గిరి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం

మల్కాజ్గిరి జనసముద్రం న్యూస్ జూలై 05:వివిధ సమస్యలతో ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు వెంటనే మెరుగైన చికిత్స అందించే విధంగా డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు.శుక్రవారం రోజున ఉప్పల్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మల్కాజిగిరి ఏరియా హాస్పటల్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలోని అన్ని వార్డు లను, ప్రతి ఓపిలను, ల్యాబ్, ఐ సియూ యూనిట్, ఆక్సిజన్ యూనిట్, ఎక్స్ రే, ప్రసూతి రూమ్ , ప్రత్యేక నవజాత శిశు కేంద్రం ,సునిశితంగా పరిశీలించి,అక్కడ పరిస్థితులు,రోగులకు అందిస్తున్న వైద్య సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్య సదుపాయాల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట వైద్య పరికరాలు సమకూర్చుకోవాలని సూచించారు. ఆసుపత్రులలో వైద్య పరీక్షల గురించి ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీ సంఖ్య మరింత పెరిగేలా చూడాలన్నారు. హై రిస్క్ ఉన్న కేసులను గుర్తించి గాంధీ,కోటి హాస్పిటల్ కు రిఫర్ చేయాలన్నారు. ప్రతిరోజు ఆసుపత్రికి ఎంతమంది పేషెంట్లు వస్తారని పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలతో వచ్చే పేషెంట్లకు వెంటనే మెరుగైన చికిత్స అందించే విధంగా డాక్టర్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది ఎంతమంది హాస్పటల్ విధులు నిర్వహిస్తున్నారని ఆరా తీశారు .రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగ కుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి నిర్వహణ మెరుగ్గా ఉండాలన్నారు. స్కానింగ్ కోసం స్లాట్ లు బుక్ చేసుకునే విధానాన్ని సిబ్బంది కలెక్టర్ కు వివరించారు. ఫార్మసీలో మందుల నిల్వ గురించి ఆరా తీశారు. ల్యాబ్ రెటర్ లో ఉన్న సౌకర్యాల గురించి, జనరల్ మెడిసిన్,అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని క్షుణ్ణంగా పరిశీలించి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు.



ఇప్పటివరకు మలేరియా డెంగ్యూ కేసులు ఎన్ని వచ్చాయని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో మలేరియా, డెంగ్యూ వ్యాధుల నుండి ప్రజలను కాపాడేందుకు ఆసు పత్రులలో వైద్య సౌకర్యాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు.ఆరోగ్యశ్రీ సేవల గురించి వాకబ్ చేశారు. ఈ కార్యమంలో జిల్లా డి ఎం అండ్ హెచ్ ఓ రఘునాథ స్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డి సి హెచ్ కోటియా నాయక్, సౌందర్య లత, మల్కాజ్గిరి డిఎం అండ్ హెచ్ వో ఆనంద్ ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ ఆర్ఎంఓ సునీత, సంగీత్ ,పద్మావతి సంధ్యారాణి, గీతా, చంద్రకళ ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలను కలిసిన ఇంగే భాస్కర్ టి ఆర్ ఆర్ ఎస్

## రాష్ట్ర అధ్యక్షులు నాయకుల ఆధ్వర్యంలో రైతు సమస్యలపై నాగేశ్వరరావు చెన్నారెడ్డికి వినతి పత్రం



ఎల్కతుర్తి జులై 5 జన సముద్రం న్యూస్తెలంగాణ రైతు రక్షణ సమితి(టీఆర్ఆర్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు ఆధ్వర్యంలో ఆ సమితి హన్మకొండ జిల్లా అధ్యక్షుడు హింగె భాస్కర్.. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డిలను శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వారు రైతు సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. అన్నదాత శ్రేయస్సు కోసం రాష్ట్ర సర్కారు పని చేయాలని కోరారు. స్వామినాథన్ కమిటీ సూచన ప్రకారం న్యాయంగా పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని, ప్రకటించిన ఎంఎస్పీకి చట్ట భద్రత కల్పించాలని, పంటల బీమా పథకం



పంట నష్టం జరిగిన 30 రోజులలో..జరిగిన నష్టానికి తక్కువ కాకుండా చెల్లించాలన్నారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కూలీలతో సంబంధం ఉన్న అన్ని వ్యవసాయ పనులకు సంబంధించి రైతులకు 50% ఖర్చు భరించే విధంగా అనుసంధానం చేయాలని రిక్వెస్టు చేశారు. రైతు ప్రైవేటు అప్పుల బారిన పడకుండా రూ.3 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పించాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కర్షకుడికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు రక్షణ సమితి(టీఆర్ఆర్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరి రావు, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, సంఘం నాయకుడు సురావు బాపురావు, వివిధ జిల్లాల అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు అండగా కదం తొక్కిన విద్యార్థి సంఘ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

జన సముద్రం న్యూస్ వీణవంక జూలై 5:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం టీజీపీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్ వన్ పోస్టుల 1:100 ప్రకారం నిర్వహించాలని. గ్రూప్-2 పోస్టుల సంఖ్యను పెంచి రీ నోటిఫికేషన్ నిర్వహించాలని డీఎస్సీ పరీక్షను వాయిదా వేయాలని పోస్టుల సంఖ్యను పెంచాలని శుక్రవారం రోజు హైదరాబాదులోని టీజీపీఎస్ కార్యాలయం ముట్టడికి బయలుదేరిన విద్యార్థి సంఘ నాయకులను వీణవంక ఎస్సై తోట తిరుపతి అదుపులోకి తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ నిర్బంధాలతో నిరుద్యోగుల తరపున పోరాటం చేస్తున్న ఉద్యమాలను అణచలేరని కలబోలి కబుర్లు చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చుకోవాలని డిమాండ్ చేయడం జరిగింది. లేనియెడల రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు మేధావులు అందరిని ఏకం చేసుకుని భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ నిర్వహిస్తామని అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల హక్కుల సాధనకై పోరాటాలు చేస్తుంటే ఆమరణ నిరాహార దీక్షలు చేస్తుంటే కనీసం పట్టించుకోకుండా ఇతర పార్టీ ఎమ్మెల్యేలను,ఎమ్మెల్సీలను కొనుగోలుపై శ్రద్ధ సాగిస్తున్నారని





ఎద్దేవా చేశారు మీ పాలన ఇలానే కొనసాగితే భవిష్యత్తులో మీ ఉద్యోగాలు ఊడదీసే దాకా నిరుద్యోగులు నిద్రపోరని హెచ్చరించడం జరిగింది. బి ఆర్ ఎస్ వి రాష్ట్ర నాయకులు ఆవుల తిరుపతి యాదవ్,అప్పని హరీష్ వర్మ , రాపర్తి అఖిల్ గౌడ్ పి డి ఎస్ యూ జిల్లా అధ్యక్షులు అంగిడి కుమార్ లను అరెస్టు చేయడం జరిగింది

# కామన్ టైం టేబుల్ ఉత్తర్వులను రద్దు చేయాలి.

## గురుకుల ఉపాధ్యాయులపై ఒత్తిడి తగదు.

జనసముద్రం జమ్మికుంట (టౌన్) న్యూస్ ప్రతినిధి: 5 జూలైతెలంగాణ రాష్ట్రంలోని గురుకుల ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదని పలుచోట్ల గురుకుల పాఠ శాలలో కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బంది నిరసనలు వెలువెత్తాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు మిన్నం టాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ గురుకులాలకు కామ న్ టైం టేబుల్ నిర్ధారిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 16 ను వెంటనే ఉపసంహరించుకోవాలని "డిమాండ్" చేశారు. రాష్ట్రంలో సుమారు 700 వరకు గురుకుల పాఠశాలలో, కళా శాలలో వసతుల లేమితో కొట్టు మాట్లాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 70 శాతం మేరకు పైగా గురుకుల పాఠ శాలలకు శాశ్వత భవనాలు లేవన్నారు. పూర్తిస్థాయి వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. చాలా చోట్ల వాష్ రూమ్ లో డిమాండ్ కు తగినట్లుగా లేవు. ఇలాంటి పరిస్థితులలో గురుకులాల్లో కామన్ టైం టేబుల్ అమలు ఎలా సాధ్యమవుతుందని తమ తమ


COMMON TIME TABLE FOR RESIDENTIAL SCHOOLS OF TELANGANA



అభిప్రాయాలను, ఆవేదనలను వెల్లడిస్తున్నారు. ఏ ఒక్క పాఠశాలలో ఉపాధ్యాయుడు నివసించే విధంగా క్వార్టర్స్ ను నిర్మించలేదని పేర్కొన్నారు.ఉత్తర్వు (జీవో) ను తీసుకొచ్చే ముందు ఏ ఒక్క సంఘంతో చర్చించకుండా కనీసం టీచర్ ఎమ్మెల్సీలతో కూడా చర్చించ కుండా ఏకపక్షంగా ఉత్తర్వులు విడుదల చేయడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే ఆ జీవోను వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్ర మాలు చేపడతామని హెచ్చరించారు.

# మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో న్యాయ అవగాహన సదస్సు

## విద్యార్థినిలు ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జనసముద్రం : జూలై 5 ( పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ )పెద్దపల్లి జిల్లాలో మంథని ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం రోజు మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థినీలకు న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఏడ్ కౌన్సిల్ నుచ్చు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థినిలకు విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైమ్స్ పై అవగాహన , సమస్య వచ్చినప్పుడు షీ టీం ను సంప్రదించడం , షీ టీం పాత్ర బాలికలకు , మహిళలకు ప్రభుత్వం కల్పించిన రక్షణ చట్టాలను , కార్యక్ర మాలను ఉపయోగించుకోవాలని ఎవరికి వారు స్వీయ రక్షణ కల్పించుకోవాలని విద్యార్థినిలకు అవగాహన కల్పించారు. మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ స్వప్న మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ఆడపిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపుల అమాను షాలను ఉద్దేశించి వారి యొక్క భద్రత , ప్రభుత్వం కల్పిస్తున్న భరోసా కేంద్రాలు , సఖి కేంద్రాలు , హెల్ప్ లైన్ నెంబర్లు , యొక్క ప్రాముఖ్యతను ప్రతి ఆడపిల్లకు చదువు తప్పనిసరని ప్రస్తుతం చదువుకున్న బాలికే రేపటి బంగారు భవిష్యత్తుకు బాట వేస్తు మహిళగా సమాజం లోని మార్పు కు నాంది తెస్తుందని , ఆడపిల్ల అంటే ప్రగతిలో ఆకాశానికి ఎదగాలని , చదువుకునే దశలోనే ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని వాటిని సాధించడానికి నిరంతరం శ్రమించాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం , వైస్ ప్రిన్సిపాల్ ఝాన్సీ , శ్రీధర్ రావు , తదితరులు పాల్గొన్నారు.





## వేములవాడ రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

### -ప్రతి ఆరుద్ర నక్షత్రం రోజున ప్రత్యేక అభిషేకాలు

జన సముద్రం న్యూస్, కోహెడ,జులై 05:(కోహెడ ప్రసాదరావు)ప్రముఖ శైవ క్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆరుద్ర నక్షత్రం సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజే శ్వర స్వామివారి ఆలయం లో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం తో స్వామివారి కి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ అప్పల భీమన్న శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు గణపతి పూజ మహన్యాస పూర్వక రుద్రాభిషేకము అమ్మవారికి శ్రీ సూక్త ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాజరాజేశ్వరుడి జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రము పవిత్రత దృష్ట్యా ప్రత్యేక కార్యక్రమాల్ని, అభిషేకాలు కార్యక్రమాల్ని నిర్వహించారు. అలాగే శుక్రవారం రోజు కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పోటెత్తారు.ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. శుక్రవారం సాయంత్రం సైతం రాజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు అర్చక స్వాములు, వేద పండితులు చెబుతున్నారు.ప్రతి ఆరుద్ర నక్షత్రం రోజు ప్రత్యేక పూజలు ఉంటా యని ఆలయ అర్చకులు తెలిపారు. ప్రతి మాస శివరాత్రి ఆరుద్ర నక్షత్రం రోజుల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని అర్చకులు వివరించారు.



## ముందస్తు అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

### ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఉట్కూరి ప్రణీత్ గౌడ్

ఎల్కతుర్తి జులై 5 జన సముద్రం న్యూస్ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఉదయం 9:00 గంటలకు ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు ప్రణీత్ గౌడ్ ను ఎల్కతుర్తి పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ కు తరలించిన పోలీసులు. అక్రమ అరెస్టులను ఖండించాలని పిలుపునిచ్చిన ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వుట్కూరి ప్రణీత్ గౌడ్. ఏఐఎస్ఎఫ్ ఎట్లాంటి కార్యక్రమం పిలుపులు లేకపోయినా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వుట్కూరి ప్రణీత్ గౌడ్ ను ఎల్కతుర్తి మండలం పోలీస్ వారు శుక్రవారం ఉదయం అరెస్టు చేయడం, జరిగింది ఉదయం 6 గంటలకు హసన్పర్తి పోలీస్ వారు జిల్లా సహాయ కార్యదర్శి కసరబోయిన రవితేజ నురాష్ట్రవ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామీకం అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నాం భవిష్యత్తులో ఇట్లాంటి పుర నావృతం అయితే పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.



## రెండో దశ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

జన్నారం మండల విలేకరి, జన సముద్రం న్యూస్, జూలై 5జన్నారం పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఉన్న వివిధ కోర్సులలో రెండో దశ ప్రవేశాలకు విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కోరారు. శుక్రవారం జన్నారం లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐటిఐ కళాశాలలోని వివిధ కోర్సులకు ఆన్లైన్లో జూలై 4 నుండి 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. తగిన ఆసక్తి, అర్హత గల విద్యార్థులు నిజ ధ్రువీకరణ పత్రాలతో ఐటిఐ వెబ్సైట్ ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు.



## నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

జన్నారం మండల విలేకరి, జన సముద్రం న్యూస్, జూలై 5గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన సమస్యలను పరిష్కరించాలని పిడిఎస్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ కోరారు. శుక్రవారం సాయంత్రం జన్నారం పట్టణంలోని ప్రెస్ క్లబ్లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాల క్యాలెండర్ను విడుదల చేస్తామని, అన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీలు ఇచ్చిందన్నారు. ఆ హామీల మేరకు అన్ని పోస్టులను భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పిడిఎస్యు నాయకులు పాల్గొన్నారు.



## కార్యకర్త కు ఆర్థిక సహాయం రాయల్ మురళీ

జన సముద్రం న్యూస్,05జూలై,అనంతపురం.ఏ నారాయణపురం గ్రామపంచాయతీలో తపోవనం లో నివసిస్తున్న రంగనాథ్ బ్రాహ్మణ తెలుగుదేశం పార్టీ బూత్ కన్వీనర్ సీనియర్ కార్యకర్త షుగర్ వ్యాధితో బాధపడుతూ గత వారంలో కర్నూల్ లో కాలు తీసివేయడం జరిగింది కర్నూల్ ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ ఇంటికి వచ్చిన రంగనాథ్ ను పరామర్శించిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, బూత్ ఇంచార్జ్ జయప్రకాష్, బాల, వెంకటలక్ష్మి , వరాలమ్మ, వెంకటరాముడు, గాండ్ల ఆదినారాయణ, హాజీ వలి, మాసూలు చంద్ర , వడ్డే హరికుమార్ తదితరులు రంగా ఇంటికి వెళ్లి ధైర్యంగా ఉండు విషయాన్ని స్థానిక శాసనసభ్యులు దృష్టికి తీసుకుపోయి నీకు న్యాయం చేస్తామని తెలియజేశారు ప్రస్తుతం వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం చేసిన రాయల్ మురళి.



### అపరిశుభ్ర పరిసరాలు అంటూ రోగాలకి ఆవాసాలని పరిసరాల పరిశుభ్రత

### ఆరోగ్యానికి భద్రతని, సంపూర్ణ ఆరోగ్యంతో ఆనందంగా జీవించవచ్చని

## అసిస్టెంట్ మలేరియా అధికారి జే గోవిందరావు సూచించారు

జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా టౌన్ రిపోర్టర్ 5స్థానిక ఏలూరు లంకపేట రెండవ రోడ్ లో ప్రజలకు పరిసరాల పరిశుభ్రత ఆచరించడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరిస్తూ వర్షాకాలంలో వర్షాలు అధికంగా పడడం వల్ల కీటకాలు అభివృద్ధి చెంది ముఖ్యంగా దోమలు ఈగలు ద్వారా ప్రాణాంతక వ్యాధులైన డెంగ్యూ మలేరియా అతిసారా,కామెర్లు, టైఫాయిడ్ మొదలగు అనారక సమస్యలతో బాధపడే అవకాశం ఉందని ముఖ్యంగా దోమలు పెరగకుండా ఇంటి పరుషాలు పల్లప్రాంతాలు మట్టితో పూడ్చుకోవాలని సాధారణంగా మనం వాడే తొట్టెలు డ్రమ్ములు ఓవర్ ట్యాంకులు వారానికి ఒకసారి కడిగి మూతలు పెట్టుకోవాలని తద్వారా దోమల వ్యాప్తిని అరికట్టుకోవచ్చని, మురికి కాలంలో చెత్త వేయరాదని సూచించారు అలాగే ఈగల అభివృద్ధి ఇంటి పరిసరాల్లో చెత్త పోగులు,పేడ పోగులు పెట్టరాదని ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే ఆచరించాలని సూచించారు ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

## దొంగ పెన్షన్లపై ముఖ్యమంత్రి ఉక్కుపాదం

### అర్హత లేని దొంగ పింఛన్ల దారులను... కనిపెట్టి మండల స్థాయి అధికారులు క్యాన్సిల్ చెయ్యాలి

### బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోకపోతే..! మండల స్థాయి అధి కారులను సస్పెండ్ చేసే అవకాశం ఉంది



అన్నమయ్య జిల్లా ఇన్చార్జి న్యూస్ రిపోర్టర్ జూలై 5 జనసముద్రం న్యూస్ జన సముద్రం న్యూస్ లో మరియు సిబిఐ సిక్స్ నైన్ యూట్యూబ్ ఛానల్ లో వచ్చిన రైల్వే కోడూరు మండలం అనంతరాజుపేట పంచాయితీ లో భర్త బతికుండగానే భార్యకు ఒంటరి మహిళ అని 2020 నుండి పింఛన్లు ఇవ్వడం ఈ వార్తకు స్పందించిన ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు వారు ఇందులో భాగంగానేఆంధ్ర రాష్ట్రంలోరాష్ట్ర వ్యాప్తంగా 2,50,000 వేల దొంగ పెన్షన్లు. విచారణకి ఆదేశించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.ఉదాహరణకు ఆధార్ లో వయస్సు మార్చుకొని మరియు వికలాంగుడు కాకపోయినా వికలాంగుల పెన్షన్ మరియు ఒంటరి మహిళ కాకపోయినా పెన్షన్ మరియు వితంతు పెన్షన్ అక్రమంగా పొందటం..కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు కూడా పెన్షన్లు పొందుతూ అర్హులైన వారికి పెన్షన్ ఆపి అడ్డగోలుగా దోచేస్తున్నారు. బాధ్యులైన అధికారులు ఇప్పటికైన చర్యలు తీసుకోకపోతే బారీగా మండలస్థాయి అధికారులను సస్పెండ్ చేసే అవకాశం ఉంది.పెన్షన్ల అవకతవకల మీద ముఖ్యమంత్రి చంద్రబాబు సీరియస్ గా ఉన్నారు.

## పెద్దిరెడ్డి కుటుంబంపై విజిలెన్స్ డీజీకి ఫిర్యాదు చేసిన టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి





అన్నమయ్య జిల్లా ఇన్చార్జి న్యూస్ రిపోర్టర్ జూలై 5 జనసముద్రం న్యూస్తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపై విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్ డీజీకి ఫిర్యాదు చేశారు. మంగంపేట ముగ్గురాయి గనుల అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు. ముగ్గురాయి గనుల్లో రూ.2 వేల కోట్ల మేర దోపిడీ చేశారని తెలిపారు. ఏంప్రెడా కంపెనీ ముసుగులో పెద్దిరెడ్డి కుటుంబం భారీ దోపిడీకి పాల్పడిందని భూమిరెడ్డి ఆరోపించారు. మాజీ ఎండీ వెంకట్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి అక్రమార్కులకు అండగా నిలిచారని వివరించారు.

# జిల్లా గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళా వేధింపుల నివారణ కమిటీ ఏర్పాటు. డీపీఓ శ్రీనివాస విశ్వనాధ్



జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా టౌన్ రిపోర్టర్ జులై 5 ఏలూరు, పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు నిరోధానికి జిల్లా గ్రామ పంచాయతీ అధికారి కార్యాలయంలో మహిళా కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాధ్ అన్నారు. తన కార్యాలయంలో శుక్రవారం మహిళలపై లైంగిక వేధింపులు నిరోధానికి తీసుకోవలసిన చర్యలపై డీపీఓ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడేరు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులను నిరోధించడానికి 2013వ సంవత్సరంలో ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. చట్టం అమలులో భాగంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలు మేరకు డీపీఓ కార్యాలయంలో మహిళలు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, న్యాయవాదితో 5 సభ్యుల కమిటీ ఏర్పాటు చేసామన్నారు. తన కార్యాలయంలో మహిళలపై లైంగిక వేధింపులు జరిపే వారిపై తీవ్రమైన చర్యలుంటాయన్నారు. అలాగే త్వరలో ఫిర్యాదు బాక్స్ ఏర్పాటు చెయ్యడం జరుగుతుందని, కార్యాలయంలో పనిచేసే మహిళలు సమస్యలు ఎదుర్కొంటే తమ ఫిర్యాదులను కంప్లైంట్ బాక్సులో వేస్తే నిర్ణీత సమయంలో పరిశీలించి తదుపరి చర్య తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఈ కమిటీలు కేవలం జిల్లా కార్యాలయానికి పరిమితి చేయకుండా జిల్లా వ్యాప్తంగా ఉన్నా పంచాయతీ వింగులో పనిచేసే ప్రదేశంలో మహిళలతో లైంగిక వేధింపులు నివారణ కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ చట్టం అమలుకు సంబంధించి చట్టం పరిధిలోకి వచ్చే అంశాలు, ఫిర్యాదు ఎవరికీ, ఏ విధంగా చేయాలి, బాధిత మహిళల నుండి ఫిర్యాదు తీసుకోవడం, ఫిర్యాదుపై తదుపరి చర్యలు, ఫిర్యాదుపై విచారణకు కమిటీని ఏర్పాటుచేసి, విచారణ అనంతరం వేధింపులు చేసిన వ్యక్తిపై తీసుకోవలసిన చర్యలపై నివేదిక అందించడం, ఫిర్యాదుదారులో ఆత్మస్థైర్యం కలిగించడం, తదితర చర్యలపై కమిటీ సభ్యులకు, ఉద్యోగులకు అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. సందర్భంగా కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసరుగా జూనియర్ అసిస్టెంట్ కొయ్య సునీతను మహిళలు అందరు ఏకగ్రీవంగా ఎన్నికోగా, సిబ్బంది ఫతిమ, విజయ సభ్యులుగా ఎన్నిక కాబడ్డారు. కార్యాలయాలలో పనిచేసే మహిళలు ప్రశాంత వాతావరణంలో విధులు నిర్వర్తించే వాతావరణాన్ని కార్యాలయంలో కలిగించేందుకు కమిటీలు కృషి చేయాలన్నారు డీపీఓ సూచించారు. కార్యక్రమంలో యన్.జి.ఓ ప్రతినిధి కృష్ణారావు సీనియర్ సహాయకులు కిషోర్, సురేష్, సిబ్బంది సోములు, తాహేరా, చంద్ర, సత్య పులి తదితరులు పాల్గొన్నారు.

# ఔట్సోర్సింగ్ సిబ్బంది.సమస్యలు నా దృష్టికి వచ్చిన ఎడల వెంటనే పరిష్కరిస్తా. ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ వెల్లడి



జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా టౌన్ రిపోర్టర్ జులై 5ఏలూరు కార్పొరేషన్ లో ఉద్యోగ సిబ్బందికి మరియు ఔట్సోర్సింగ్ కార్మికులకు ఏ సమస్య వచ్చిన నా దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కరిస్తానని ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం నాడు స్థానిక కోట దెబ్బ ఎస్ ఆర్ వన్ వద్ద ఏఐటియుసి అనుబంధ ది మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ 35వ వార్షికోత్సవ కార్యక్రమంలో శాసనసభ్యులు బడేటి చంటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జాతీయ పతాకాన్ని బడేటి చంటి ఆవిష్కరించగా ఏఐటీయూసీ పతాకాన్ని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. మహాత్మా గాంధీ విగ్రహానికి చంటి పూలమాలవేసి నివాళులర్పించగా అంబేద్కర్ గ్రహానికి మాజీ కార్పొరేటర్ చోడే వెంకటరత్నం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బండి వెంకటేశ్వర రావు అధ్యక్షత వహించారు. బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో ముఖ్యంగా ఏలూరు నగరంలో నగర ప్రజానీకానికి మంచినీటి కొరత రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వాటర్ సప్లై మరియు వాటర్ వర్క్స్ ఉద్యోగ సిబ్బంది పై ఉందని ఆయన తెలిపారు. ఉద్యోగ సిబ్బంది ఏం మాత్రం అలసత్వం వహించిన ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని అటువంటి పరిస్థితుల్ని తీసుకురావద్దని ఆయన కోరారు. ఉద్యోగ సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉంటే యూనియన్ నాయకుల ద్వారా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సభలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ చోడే వెంకటరత్నం మాట్లాడుతూ ఏలూరు కార్పొరేషన్ లో ఉద్యోగ సమస్యలపై న్యాయపోరాటం ఏఐటీయూసీ నాయకత్వం చేస్తాదని ఎప్పుడు ఏఐటీయూసీ నాయకులు వివాదాలకు వెళ్లరని ఆయన పేర్కొన్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు కార్పొరేషన్ లో సుమారు 1000 మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగ సిబ్బంది పనిచేస్తున్నారని వారందరినీ సర్వీస్ సీనియార్టీ ప్రకారం రెగ్యులర్ చేయాలని రెగ్యులర్ చేయుటకు శాసనసభ్యులుగా మీ సహాయ సహకారాలు అందించాలని అదేవిధంగా కార్పొరేషన్ లో పనిచేస్తున్న ఐదుగురు ఎన్ ఎం ఆర్ లకు రెగ్యులర్ గా వేతనాలు వచ్చేలాగా శాసనసభ్యులు ప్రయత్నించాలని ఆయన కోరారు. ఏఐటీయూసీ యూనియన్లు ఉద్యోగుల కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తూనే ఉద్యోగులకు కార్మికులకు తమ బాధ్యతలను విధులను తెలియజేస్తుందని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఎం ఈ పి కొండలరావు మాట్లాడుతూ ఏఐటియుసి ఉద్యోగులు కార్మికులకు అండగా ఉంటాదని ఆయన తెలిపారు. ఏఐటీయూసీ యూనియన్ అభివృద్ధికి ఉద్యోగులు కార్మికులు తోడ్పాటు ఇచ్చి వాళ్ల సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన హోప్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బడేటి చంటి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డి ఈ ఈ తాతబ్బాయి ఏఈ సాయి యూనియన్ వ్యవస్థాపకులు చిలుకూరి రమేష్ కుమార్ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ అప్పలరాజు మరియు యూనియన్ నాయకులు పివి రమణ బి నారాయణరావు ఎస్ఎంవిసుబ్బారావు ఎస్ శ్రీనివాస్ సిహెచ్ హరినాథ్ డి వెంకటేశ్వరరావు కే లో మీ డి వెంకటేష్ ఎస్కే ఆలీ సయ్యద్ బాజీ కే శ్రీనివాస్ డి అప్పారావు డి దుర్గాప్రసాద్ సిహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి నెల 1,20,000 ఖర్చుతో శాశ్వత నిత్య అన్నదానం

## చైర్మన్ పాణ్యం సుబ్రహ్మణ్యం స్వామి




రైల్వే కోడూర్ జన సముద్రం న్యూస్ జూలై 05 ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం, ఓబులవారిపల్లె మండలం ముక్కావారి పల్లె క్రాస్ రోడ్డు నుండి 2.5కి.మీ అప్పారావు సర్కిల్ కాశీనగరం జీవనజ్యోతి ఆనంద నిలయంవృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, అమ్మ ఒడి అందని పేద కుటుంబాలకు, ప్రతి నెల 1,20,000 ఖర్చు ద్వారా శాశ్వత నిత్య అన్నదానం కొనసాగిస్తున్న నేటి కారణ జన్ముడు పాణ్యం సుబ్రమణ్య స్వామివృద్ధాప్య పింఛనుకు నోచుకోని వృద్ధులనుదివ్యాంగుల పింఛనుకు నోచుకోని దివ్యంగులనునా అనేవారు లేని చిన్నారులనుఅక్కున చేర్చుకొనినెలకు దాదాపు ఒక లక్ష ఇ ర వై వేలు 1,20,000 ఖర్చు చేస్తూ జీవనజ్యోతి ఆనంద నిలయం శాశ్వత నిత్య అన్నదాన ఆశ్రమం ద్వారా ఎంతోమంది పేదల ఆకలి తీరుస్తున్న చైర్మన్ సుబ్రహ్మణ్యం స్వామి కారణజన్ముడుఅంటూ ప్రత్యేకంగా అభినందించినఎన్నారై అమెరికా ప్రముఖ సేవా సంఘం బృందంచైర్మన్ సుబ్రహ్మణ్యం స్వామివారి ఉద్యోగ పీఎఫ్ మొత్తాన్ని మరియు ఎస్బిఐ పర్సనల్ లోన్. మొత్తాన్ని ఉద్యోగ సేవింగ్ ఖాతా రుణాల మొత్తాన్నివిద్య రుణాల మొత్తాన్ని వారు దాదాపు 20 సంవత్సరాలుగా పొదుపు చేసుకున్న మొత్తాన్నిదాదాపు 28 లక్షలు సరిపోక పోగాజితన సొంత వ్యవసాయ పొలం నాలుగు లక్షల రూపాయలకుకుదవ ఉంచిపేదల ఆకలి తీరుస్తున్న గొప్ప మనసున్న కారణజన్ముడు జీవనజ్యోతి ఆనంద నిలయం చైర్మన్ పాణ్యం సుబ్రమణ్యం వారికి శతకోటి వందనాలు తెలియజేస్తున్నఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ లిడిపార్ట్మెంట్ డి. ఇ. ఏరాష్ట్ర ప్రధాన కార్యదర్శిబుర్రి మహేశ్వరరావు మరియు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ డి ఇ ఏ కుటుంబ సభ్యులు 8,88,888 మంది ప్రత్యేకమైన హృదయ పూర్వక ధన్యవాదములు తెలియజేస్తూ ప్రతి నెల నెలలో ఒకరికి ఒక పూట అన్నదానం జరిపే అవకాశం కల్పించాలని ప్రత్యేకంగా చైర్మన్ సుబ్రహ్మణ్యం స్వామిని సంప్రదించడం జరుగుతున్నది ప్రతి ఒక్కరూ మానవత్వం మన అందరిదీ అను నినాదం పైన ఆకలితో ఉన్నవారికి ఒక్కపూట ఒక్కరోజు ఆకలి తీర్చగలిగితే వారికి సాక్షాత్తు ముక్కోటి దేవతలు తోడుగా నిలిచి వారిని అన్నదాతలుగా నిత్య అన్నదాతలుగా శాశ్వత అన్నదాతలుగా ముక్కోటి దేవతలు తోడై నడిపిస్తాయని అందుకు ఆదర్శం చైర్మన్ పాణ్యం సుబ్రహ్మణ్యం స్వామి అని వారు ఎన్నో ప్రాంతాలలో ఉద్యోగాలు చేస్తూ వారు ఎప్పుడూ పక్కవారి ఆకలి తీరుస్తూ ఉండేవారని వారికి దైవం తోడై శాశ్వత నిత్య అన్నదానం జీవనజ్యోతి ఆనంద నిలయం ద్వారా కొనసాగించడం ముక్కోటి దేవతల ద్వారా నిర్ణయించబడిన విషయమని నేటి కాలానికి సాక్షాత్తు దైవం జీవనజ్యోతి ఆనంద నిలయం శాశ్వత నిత్య అన్నదాన ఆశ్రమం చైర్మన్ పాణ్యం సుబ్రహ్మణ్యం స్వామి హృదయం ద్వారా ప్రజలకు కనిపిస్తున్నదని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ డి. ఇ. ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేశ్వరరావు మరియు అసోసియేషన్ కుటుంబ సభ్యులు 8,88,888 మంది ప్రత్యేక మీడియా సమావేశం ద్వారా తెలిపారు

# సమర్ధవంతులకే అవార్డులు జిల్లా కలక్టర్ వెట్రి సెల్వి





జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా టౌన్ రిపోర్టర్ జులై 5.ఏలూరు, ప్రధానమంత్రి అవార్డులు–2023 కోసం జిల్లాలోని వివిధ శాఖల అధికారులు కేంద్ర పరిశీలన బృందానికి అందించిన సమాచారాన్ని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి శుక్రవారం అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక కలెక్టరేట్ లో శుక్రవారం పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లో శ్రేష్టత కోసం ప్రధాన మంత్రి అవార్డులు 2023–ఎంపికలో భాగంగా జిల్లాలో గతనెలలో పర్యటించిన కేంద్ర బృందం పరిశీలించిన అంశాలు, సంబంధిత శాఖల అధికారులు కేంద్ర బృందానికి సమర్పించిన నివేదికలపై అధికారులతో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రధానమంత్రి అవార్డులు–2023 కోసం కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాల అమలు తీరును సంబంధిత వ్యక్తిగత లబ్దిదారుల ద్వారా సమాచారం సేకరించిందన్నారు. కేంద్ర బృందం జిల్లాలోని ప్రధాన మంత్రి అవాస్ యోజన, హర్ గర్ జల్ యోజన, మిషన్ ఇంద్రధనుష్, ప్రధాన మంత్రి జన్ ఆరోగ్యయోజన, ప్రధాన మంత్రి ఉజ్వలయోజన, పిఎం స్వానిధి, ప్రధాన మంత్రి మాతృవందనయోజన, పిఎం విశ్వకర్మయోజన, పిఎం ముద్రయోజన, ప్రధానమంత్రి పోషణయోజన, తదితర పథకాలు అమలు చేస్తున్న సంబంధింత శాఖల అధికారులు కేంద్ర బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించిన అంశాలను, ఆయా పథకాల అమలుపై కేంద్ర బృందానికి తాము అందించిన సమగ్ర సమాచారాన్ని కలెక్టర్ కు తెలియజేసారు. సమావేశంలో హౌసింగ్ పిడి కె.రవికుమార్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ ఎన్ వివి. సత్యనారాయణ, డియంహెచ్ఓ డా. శర్మిష్ట, డిఇఓ అబ్రహాం, డిఎస్ఓ ఆర్. ఎస్.ఎస్. రాజు, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, జిల్లా పరిశ్రమల కేంద్రం జియం ఆదిశేషు, ఎల్ డిఎం నీలాద్రి, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత విద్య , ఉచిత వైద్యం అందించాలి : రోటం భూపతి ముదిరాజ్

జనసముద్రంన్యూస్, జూలై 5:
అఖిల భారత కోలి సమాఖ్య సమావేశం హైదరాబాద్ లో జరిగింది. ఈ సమావేశంలో అఖిల భారత కోలి సంఘం ఉపాధ్యక్షులు రోటం భూపతి ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారత దేశం లో పేద ప్రజలు అందరికి కేజీ నుండి పీజీ వరకు ఉచిత విద్యను అందించాలని, అలాగే ఉచిత వైద్యం అందించాలని కోరారు. అనేక రకాలైనటువంటి ఉచితాలు ఇస్తున్నారు. దక్షిణ భారత దేశం లో ఇంకా చాలా మంది పేదలు ఉన్నారని తెలిపారు.

ఈ కార్యక్రమం లో మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్, అఖిల భారత కోలి సంఘం సభ్యులు




పాల్గొన్నారు.

# రాష్ట్ర టిడిపిఅధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుని మర్యాదపూర్వకం గాకలిసిన ద్వారకాతిరుమలమండల గ్రామ టిడిపి నేతలు





(జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా గోపాలపురం నియోజవర్గం ప్రతినిధి) ద్వారకాతిరుమల, జులై5: కృష్ణాజిల్లా.మంగళగిరిలోనితెలుగుదేశంపార్టీకార్యాలయంవద్ద రాష్ట్ర తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావునీమర్యాద పూర్వకంగా ద్వారకాతిరుమల మండల గ్రామ టిడిపి నేతలు వారి కార్యాలయం వద్దకలిసి వెంకటేశ్వరస్వామి వారి ప్రసాదం అందజేసి దుస్సాల్వాతో సత్కరించి స్వామివారి మెమెంటో అందజేశారు. మండల టిడిపి నేతల ఆహ్వానం మేరకుద్వారకాతిరుమల స్వామి వారి దర్శనం చేసుకొని వెళ్లవలిచినదిగా తెలిపారు. ద్వారకాతిరుమల మండల గ్రామ.రాజకీయ పరి స్థితులు గురించి.పల్లా శ్రీనివాసరావు తెలుసుకున్నారు,ఈ కార్యక్రమంలో. గోపాలపురం వాణిజ్య విభాగం అధ్యక్షులు ఇమ్మడి రత్నాజీ, ఏలూరు జిల్లా టిడిపి కార్యదర్శి. కూరాకుల బుజ్జి యాదవ్, సీనియర్ టిడిపి నాయకులు గువ్వలమావుళ్ళరావు, పాల్గొన్నారు.

# పోలీసులకు రివార్డులు అందించిన ఏలూరు జిల్లా ఎస్.పి డి మేరీ ప్రశాంతి

జనసంద్రం న్యూస్ ఏలూరు జిల్లా టౌన్ రిపోర్టర్ జులై 5 చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంగుటూరు మండలం కంసాలి గుంట 16.01. 2023 వా తేది నాడు పేకాట శిబిరం పై దాడులు నిర్వహించి పేకాట నిర్వహిస్తున్న 23 వ్యక్తులను అదుపులోనికి తీసుకుని వారి వద్ద నుండి సుమారు 8,45,000/- 29.12.2023 వా తేది నాడు గౌరవ న్యాయ కోర్టు వారి ఎదుట హాజరు పరచగా గౌరవ న్యాయస్థానం వారు ఒక్కారికి 300/- జరిమానా విధించారు.

గౌరవ న్యాయస్థానం చేబ్రోలు పోలీస్ స్టేషన్ పోలీస్ సిబ్బంది నిర్వహించిన పేకాట శిబిరాలపై దాడుల్లో నిర్వహించిన దానిపై గౌరవ కోర్టు పోలీస్ సిబ్బందికి 1,65,000 రూ.లు రివార్డు ఇచ్చినారు.ఈరోజు అనగా 05.07.2024 వ తేదీ నాడు ఏలూరు జిల్లా ఎస్పీ డి మేరీ ప్రశాంతి ఐపీఎస్ చేబ్రోలు పిఎస్ లో పనిచేస్తున్న



సిబ్బందికి గౌరవ న్యాయస్థానం వద్ద నుండి రాబడిన చెక్కులను సిబ్బందికి అంద చేసి అప్పటి చేబ్రోలు ఎస్ఐ స్వామి ని మరియు వారి యొక్క సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించినారు.

# ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

**- వాహనదారుడు తమ ప్రాణాలేకాకుండా కుటుంబ సంక్షేమాన్ని గుర్తించుకోవాలి...**
**- వాహనదారుడు రోడ్డు భద్రత నియమాలను పాటించాలి...**

జనసముద్రం న్యూస్ ఏలూరు జిల్లా టౌన్ రిపోర్టర్ జులై 5 ఏలూరు, జులై 05... రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా హెల్మెట్ ధరించడం ద్విచక్రవాహన దారులకు క్షేమమని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోవున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో ట్రాఫిక్, ట్రాన్స్ ఫోర్ట్ అధికారులైన ట్రాఫిక్ సిఐ కె. శ్రీనివాసరావు, ఆర్టిఓ కె. శ్రీహరి లతో కలిసి హైకోర్టు ఆదేశాలను అనుసరించి ద్విచక్ర వాహనదారుల భద్రతకు సంబంధించి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. రత్నప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో 3703 మంది రోడ్డు ప్రమాదాలకు గురై మరణించినవారిలో 3042 మంది హెల్మెట్ ధరించకపోవడం కారణమని తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటిస్తూ హెల్మెట్ ను ధరించి ప్రయాణం చెయ్యాలని తెలిపారు. మరి ముఖ్యంగా యువత ద్విచక్రవాహనం అతివేగంగా నడపడం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదం జరిగి మరణించడం జరుగుతుందని తెలిపారు. కుటుంబ యజమాని, యువత, మరి ముఖ్యంగా విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో మరణిస్తే ఆకుటుంబానికి తీరని నష్టం జరుగుతుందని . అతివేగం ప్రాణానికి ముప్పుని తెలుసుకుని వాహన నడపాలన్నారు. రోడ్డు భద్రత నియమాలకు, ప్రమాదాలకు సంబంధించి విరివిగా ప్రచారం కార్యక్రమాలు, అవగాహన సదస్సులు, సంబంధిత ట్రాన్స్ పోర్టు, పోలీస్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేసి హెల్మెట్ లేనివారిపై కేసులు నమోదు చేయడానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు.




రూల్ 167 ప్రకారం రోడ్డు భద్రతకు సంబంధించి ఎలక్ట్రానిక్ పరికరాలైన స్పీడ్ కెమేరా, క్లోజ్డ్ సర్క్యూట్, టెలివిజన్ కెమేరా, స్పీడ్ గన్, బాడీ వేరిబుల్ కెమేరా, తదితర టెక్నాలజీ పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం రోడ్డు భద్రతకు వాడుతున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు వాహనాన్ని నడిపేటప్పుడు తన ప్రాణాన్నే కాకుండా తన కుటుంబ సంక్షేమాన్ని కూడా దృష్టిలో పెట్టుకొని వాహనాన్ని నడపాలని దీనికి సంబంధించిన భద్రత మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటించాలని, హెల్మెట్ ను తప్పనిసరిగా ధరించాలని అన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారణలో భాగంగా తనిఖీలు ముమ్మరం చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

ఆర్టిఓకె. శ్రీహరి మాట్లాడుతూ
వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగివుండాలని, హెల్మెట్ ధరించివుండాలని, అతివేగాన్ని నియంత్రించుకోవాలని, వీటిని దిక్కరించి వాహన దారుడు ప్రయాణంచేస్తే కేసులు నమోదుచేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.




# నెట్వర్క్ లేకుండా ధరలు పెంచడం దారుణం : డా!! చదలవాడ హరి బాబు, సిసిఐ జాతీయ ఉపాధ్యక్షులు, పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు – పిల్లి యజ్ఞ నారాయణ

జనసముద్రంన్యూస్, జూలై 5,
పల్నాడు జిల్లా, నర్సరావుపేట.
ఇటీవల జియో, ఎయిర్ టెల్ నెట్వర్కు కంపెనీలు తమ సర్వీసు స్లాబులను దారుణంగా 20% పెంచారే తప్ప వినియోగదారులకు నాన్యమైన నెట్వర్క్ అందించడంలో వారు విఫలమయ్యారని గర్తపురి కన్స్యూమర్స్ కౌన్సిల్ వారు నిర్వహించిన విలేఖరుల సమావేశంలో సి.సి.ఐ. జాతీయ ఉపాధ్యక్షుడు డా!! చదలవాడ హరిబాబు పాల్గొని ప్రసంగిస్తూ అన్నారు. ఇతర కంపెనీల నెట్-వర్కుల నుండి తమ కంపెనీలకు మార్చుకునేందుకు ఆకర్షణీయమైనపథకాలనుపెట్టి వినియోగదారులను ఆకర్షించి వారి నెట్ వర్క్ లోకి మారినాక సిగ్నల్ సరిగా రావటము లేదని పలుమార్లు ఫిర్యాదులు లిఖిత పూర్వకముగా, మేసేజ్ ల ద్వారా కంపెనీలకి




ఫిర్యదు చేసినా నిర్లక్ష్యముగా ఉన్నారని హరిబాబు ఆవేదనచెందారు.ఏకపక్షముగాస్లాబులు పెంచడము ట్రాయ్ నిబంధనలను ధిక్కరించడమే అన్నారు. సదరు విషయాలను అన్ని వినియోగదారుల సంఘాల వారు ట్రాయ్ కి కంప్లయింట్ చేయాలన్నారు. పల్నాడు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు పిల్లి యజ్ఞ నారాయణ మాట్లాడుతూ నెట్వర్క్ సిగ్నల్ సరిగా లేకుండా స్లాబు రేట్లు 20 శాతం పెంచేయటం సమంజసం కాదని, ఈ విషయంలో అన్ని వినియోగదారుల సంఘాలు మరియు ప్రజలు పోరాడాల్సిన అవసరం ఉందని, ట్రాయ్ సైతం ఈ విషయంలో వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సంబంధిత కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ సమావేశములో గుంటూరు జిల్లా విజిలెన్స్ కమిటి సభ్యులు బీరాల నాగేశ్వరరావు, మునిపల్లె కవిత, బేబీ సరోజని, యశ్వంత్ సిన్హా, వల్లెం చెన్నకేశవులు, మల్లిఖార్జునరావు, నాగమణి పాల్గొని ప్రసంగించారు.

# ఐ లవ్ గుడివాడ"కాన్సెప్ట్ ద్వారా మన ఊరిని క్లీన్ అండ్ గ్రీన్ గుడివాడగా అభివృద్ధి చేసుకుందాం: ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

జనసముద్రం న్యూస్ గుడివాడ ప్రకృతి జులై.05.
గుడివాడలో క్రియాశీలకంగా ఉన్న స్వచ్ఛంద, సేవా సంస్థల ప్రతినిధులతో తన కార్యాలయంలో సమావేశమైన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము.

**"ఐ లవ్ గుడివాడ" కాన్సెప్ట్ ద్వారా.... క్లీన్ అండ్ గ్రీన్ గుడివాడగా అభివృద్ధి చేసుకొనేందుకు..... వివిధ సంస్థల నుండి సూచనలు కోరిన ఎమ్మెల్యే రాము**

రోడ్లపై పరిశుభ్రత. పచ్చదనం పెంపొందించేలా తీసుకోవాల్సిన చర్యలపై. పలు సలహాలు ఇచ్చిన సంస్థల ప్రతినిధులు.

గుడివాడను ప్రాంతాలవారీగా దత్తత తీసుకొని పరిసరాల పరిశుభ్రతకు కృషి చేస్తామంటూ ముందుకు వచ్చిన పలు స్వచ్ఛంద సంస్థలు.

**ఆగస్టు 15వ తేదీన పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించేందుకు సమావేశంలో తీర్మానించిన వివిధ సంస్థల సభ్యులు**

బాగా పని చేసిన స్వచ్ఛంద సంస్థలకు ప్రతి ఏటా 5 లక్షలు,3 లక్షలు, 2లక్షలు చొప్పున తమ



వ్యక్తిగతంగా ప్రోత్సాహక బహుమతులు అందిస్తానని ప్రకటించిన ఎమ్మెల్యే రాము.

**వెనిగండ్ల రాము కామెంట్స్**

గుడివాడఅభివృద్ధికిప్రభుత్వపరంగాచేయాల్సిందంతా తాము చేస్తాం.

గుడివాడ అభివృద్ధిలో అందరినీ భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో "ఐ లవ్ గుడివాడ" కాన్సెప్ట్ ప్రవేశపెడుతున్న.

రానున్న రోజుల్లో అనేక సంస్థలు.... గుడివాడలో తమ బ్రాంచ్ లను ఏర్పాటు చేసేందుకు ముందుకు రానున్నాయి.

మురికి కుపంగా ఉన్న గుడివాడను.... పరిశుభ్రత, పచ్చదనంతో నిండిన గుడివాడగ అభివృద్ధి చేసుకొని.సంస్థలనిర్వాహకులకుస్వాగతం పలకాలి.

ఊరిని పరిశుభ్రంగా ఉంచడంలో.... ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తాం.

ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, బిజెపి ఇంచార్జ్ దావులూరి సురేంద్రబాబు,లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ , లయన్స్ క్లబ్ ప్రగతి, రోటరీ క్లబ్ ఆఫ్ గుడివాడ , భారత్ వికాస్ పరిషత్,మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ,గుడివాడ ఎన్టీఆర్ వాకర్స్ క్లబ్,గుడివాడ వాకర్స్అసోసియేషన్,మహిళవాకర్స్అసోసియేషన్,, వాసవి క్లబ్ గుడివాడ,సేవా భారతి ,అజాద్ హింద్ బోర్డు,వాసవి ఇంటర్నేషనల్ పరివార్,ద్వారక సాయి సేవ సంస్థ,వాసవి కపుల్స్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గంగారం మండలం లో పర్యటించిన మహబూబాబాద్ జిల్లా జాయింట్ కలెక్టర్

జన సముద్రం న్యూస్ రిపోర్టర్ 5 జూలై 2024:
గంగారం మండలం లో ఈ రోజు మహబూబాబాద్ జిల్లా జాయింట్ కలెక్టర్ లెనిన్ వాత్సాల్ తోప పర్యటించారు శుక్రవారం ఉదయం 11బీ30 గంగారం చేరుకున్న అదనపు కలెక్టర్ నేరుగా గంగారం కేజీబీవి స్కూల్ కాలేజ్ కి వెళ్లి పాఠశాలను సందర్శించారు విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాదిస్తున్నారని ప్రశంసించారు అక్కడి నుండి రైతువేదిక కు చేరుకున్న అదనపు కలెక్టర్ 75వ వన మహోత్సవం సందర్భంగా రైతువేదిక ప్రాంగణం లో మొక్కను నాటారు అనంతరం రైతువేదిక వద్ద నీతి అయోగ్ లో భాగంగా ఏర్పాటు చేసిన ఐకేపీ అంగన్వాడి స్టాల్ ను పరిశీలించారు రైతువేదిక లో ఏర్పాటు చేసిన సమావేశం లో పాల్గొని పది ఇంటర్ లో ఫస్ట్ జీపీఏ సాధించిన కేజీబీవీ విద్యార్థులను ప్రశంసించారు అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ



వర్షాకాలం లో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చూచించారు గంగారం గ్రాడ్యుయేట్ కమిటీ అధ్యక్షులు జెజ్జరి రాము ఆర్వోఫాఫర్ పట్టాలు హక్కు పత్రాలు ఉన్న ప్రతి



రైతు కు బ్యాంక్ లో రుణా లు ఇవ్వాలని వినతి పత్రం జాయింట్ కలెక్టర్ కు ఇచ్చారు వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు ప్రజలు పలు సమస్యల పై వినతులు జాయింట్ కలెక్టర్ కు ఇచ్చారు ఈ కార్యక్రమం లో జడ్పి సిఈఓ నర్మదా మేడం డిపిఒ హరిప్రసాద్ డిప్యూటీ డిఎం& హెచుయో అంబరీష్ జిల్లా వ్యవసాయ అధికారి పంచాయతీ సెక్రటరీ లు సిద్దబొయినా నరేష్ రాముల స్వరూప తదితరులు పాల్గొన్నారు

# ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

**- కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరం**
**- హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలి**
**- హెల్మెట్, సీట్‌బెల్ట్ వాహనదారులను రక్షణ కల్పిస్తాయి**
**- విజయవాడ సర్కిల్ 2 సీఐ సత్యరమేష్**

ఎన్టీఆర్ జిల్లా,విజయవాడ,
జనసముద్రం న్యూస్,5 జూలై :
ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని స్థానిక సర్కిల్ 2 సీఐ సత్యరమేష్ అన్నారు. పోలీసు కమిషనర్, ట్రాఫిక్ డీసీపీ ఆదేశాల మేరకు శుక్రవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త చట్టాలపై ప్రజలకు అవగాహన అవసరముందని తెలిపారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని, ఇవి వాహనదారులనురక్షణకల్పిస్తాయని తెలియజేశారు. వాహనదారులు కొత్త చట్టాలపై అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్



ధరించాలని, కారు నడిపే వారు సీటుబెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. వాహనదారులందరూ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను విధిగా పాటించాలని తెలిపారు. వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలను మరో ముగ్గురికి వివరించాలని, వారిని మరో ముగ్గురికి అవగాహనకల్పించేవిధంగాప్రొత్సహించాలనితెలిపారు .ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారికి చలాన్లు విధించిన వారిలో మార్పు రావాల్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాహనదారులు చలాన్లు వేస్తారనో, భయంతోనో హెల్మెట్ ధరించకుడదని, ఎవరికి వారు అత్మరక్షణ కోసం హెల్మెట్‌ను విధిగా ధరించాలని తెలిపారు. కొత్త ట్రాఫిక్ నిబంధనల్లో చలాన్లు భారీస్థాయిలో ఉన్నాయని, ఒక్కసారి చలాన్‌కు గురైతే జేబులకు భారీగా చీలులు వడే అవకాశాలుఉన్నాయని,వాహనదారులుఅప్రమత్తంగా ఉండాలని కోరారు.

వాహనాదారులు వాహనాలు నడిపేటప్పుడు క్రమశిక్షణపాటించాలని, లేనిపక్షంలో ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందని, ఇలాంటి వారి వల్ల నెమ్మదిగా, క్రమశిక్షణతో వాహనలు నడిపే వారు సైతం ప్రమాదాల గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో ఏడాదిగా ప్రతి రోజు డ్రంక్అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, మద్యం సేవించి వాహనం నడపకుడదని, నడిపితే ప్రమాదాలకు గురి చేస్తుందని తెలిపారు.

వాహనదారులు వాహనంపై బయటకు వచ్చినప్పుడు తమ తమ కోసం ఇంట్లో వాళ్లు ఎదురు చూస్తు ఉంటారని గుర్తు పెట్టుకోవాలని తెలియజేశారు.

# రైల్వే కోడూరు ప్రజల క్షేమమే మాకు ముఖ్యం

రైల్వే కోడూర్ జనసముద్రం న్యూస్ జూలై 05
ఆంధ్రప్రదేశ్ అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లి మండలంఓబులవారిపల్లి మండలం పెద్ద ఓరం పాడు పంచాయతీ , పాపిరెడ్డిపల్లి గ్రామ వాస్తవ్యులైన పాణ్యం మనీ తండ్రి గారైన పాణ్యం వెంకటయ్య క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ హాస్పిటల్ ఖర్చులకు కూడా స్తోమత లేక వారు ఇబ్బందులు పడుతుండగా ఈ విషయం ముక్కా వరలక్ష్మి గారికి తెలపగా వరలక్ష్మి వెంటనే వారికి ముక్కారూపానంద రెడ్డి ఫౌండేషన్ ద్వారా 25 వేల రూపాయల సహాయమును చెక్కు ద్వారా అందజేయడం జరిగింది అనంతరం హైదరాబాదులోని ప్రముఖ ప్రఖ్యాత క్యాన్సర్ ఆసుపత్రి బసవతారకం క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ యాజమాన్యానికి ఈ వ్యక్తికి ఉచిత వైద్యం




అందేలా ఏర్పాట్లు చేసిన వరలక్ష్మి

జనసముద్రం న్యూస్
ప్రతి అక్షరం జనం కోసం



# రాఘవపూర్ లో చనిపోయిన వ్యక్తికి 9 నెలలుగా పెన్షన్ పంపిణీ!!

**- పెన్షన్ పర్యవేక్షణలో గ్రామ , మండల అధికారుల పనితీరు!!**

**- ప్రభుత్వ ధనం వృధా కాకూడదని పెన్షన్ తొలగించి , పొందిన పెన్షన్ రికవరీ చేయాలని ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన స.హా.చట్టం కార్యకర్త , సోషల్ వర్కర్ బొబ్బిలి సత్యనారాయణ**



జనసముద్రం జూలై 5
( పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ ):

పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామంలో 3వ వార్డులో నివాసం ఉంటున్న డొంకెన సుధీర్ వయసు 16 వికలాంగుడు తండ్రి సత్యనారాయణ కానీ పెన్షన్ వివరాలు ఆసరా వెబ్సైట్లో మాత్రం తండ్రి నర్సయ్య అని ఉంది. కానీ నర్సయ్య అనే వ్యక్తి చనిపోయిన డొంకెన సుధీర్ కు తాత అవుతాడు. డొంకెన సుధీర్ వికలాంగుడు పెన్షన్ ఐడి కేఎన్ పిడిఆర్36297 , ఎస్ కె ఎస్ . ఐడి. కెఏ0024618000 గా పెన్షన్ పొందుతున్న వ్యక్తి తేదీ : 6 అక్టోబర్ 2023 న రాఘవపూర్ గ్రామంలో వారి ఇంట్లో మరణించారు ఇతను మరణించిన నెల అక్టోబర్ 2023 నుంచి జూన్ 2024 వరకు 9 నెలలుగా చనిపోయిన వ్యక్తి బ్రతికి ఉన్నట్టుగా పెన్షన్ పొందాడు. ప్రస్తుతం జూలై నెలలో ఇవ్వబోయే పెన్షన్ నిలిపివేయలని బొబ్బిలి సత్యనారాయణ చేసిన ఫిర్యాదు పై సమగ్ర విచారణ చేపట్టి తొమ్మిది నెలల పెన్షన్ మొత్తం వేల 36 ,144 రూపాయల పెన్షన్ పొందిన వారి నుండి ప్రభుత్వానికి చెల్లించేలా రికవరీ చేయించాలి. ఇట్టి తప్పిదంపై గ్రామ , మండల అధికారులపై క్రమశిక్షణ , సస్పెండ్ వంటి తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పథకం , ప్రభుత్వ ధనం వృధా దుర్వినియోగం కాకుండా చేయాలని 1 జూలై 2024 సోమవారం రోజు రాఘవపూర్ కు చెందిన స.హ. చట్టం కార్యకర్త , సోషల్ వర్కర్ బొబ్బిలి సత్యనారాయణ పెద్దపల్లి జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో కోయ శ్రీ హర్ష కి ప్రత్యక్షంగా వివరాలను తెలుపుతూ ఫిర్యాదు దరఖాస్తును ఇచ్చారు. ఈ సందర్భంగా బొబ్బిలి సత్యనారాయణ మాట్లాడుతూ చనిపోయి 9 నెలలు అవుతున్న వ్యక్తికి బ్రతికి ఉన్నట్టుగా 9 నెలలు పెన్షన్ ఇవ్వడం పై గ్రామ , మండల పెన్షన్ పంపిణీ అధికారుల ప్రమేయం ఉందని అధికారులకు తెలియకుండాపెన్షన్ పంపిణీ ఎలా జరుగుతుందని విధుల దుర్వినియోగం జరిగిందని ఇదే కాకుండా పెద్దపల్లి మండలంలో ఇంకా ఎన్ని గ్రామాల్లో ఇలా పెన్షన్ దుర్వినియోగంఅవుతుందనిగ్రామ, మండల అధికారులపై ఆరోపణలు చేశారు.

# మండల పరిషత్ సర్వసభ్య సమావేశం





జనసముద్రం న్యూస్ (దొనకొండ ప్రతినిధి)

మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. మండల పరిషత్ అధ్యక్షురాలు బోరి గొర్ల ఉషా మురళి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

కొద్దిసేపుసజావుగా సాగిన సర్వసభ్య సమావేశంలో మండలంలో వివిధ రకాల శాఖలు సంబంధించి అధికారులుసమస్యలుతెలియజేస్తుండగాఎంపీటీసీలు కొంతమంది కలిసి మండల పరిషత్నిధులతో ఏమేమి పనులు కొనసాగించారు అంటూ పలు ఆరోపణలుచేసు కుంటూఒకరిపై ఒకరు వాదనలకు దిగారు.

అనంతరంబయట వేచి ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు కొద్దిగా పార్టీ అరుపులు జరిగేసరికి ఉద్రిక్తత ఎక్కువ వాదనలో జరగడం జరిగింది. తదుపరి జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ దర్శి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి వచ్చిన తరుణంలో ఆటంకం కలిగినది టిడిపి వర్గీయులు గో బ్యాక్ గో బ్యాక్ అంటూ బూచేపల్లి వెంకాయమ్మ కారును ఒక గంట 30 నిమిషాల వరకు కార్యాలయం గేటు బయట అడ్డుకోవడం జరిగినది అనంతరం పోలీసులు శాఖ సఖ్యంగా ఉన్నతఅధికారుల ఆదేశాల మేరకు జడ్పీ చైర్పర్సన్బూచేపల్లివెంకాయమ్మను, శాసనసభ్యులు శివప్రసాద్ రెడ్డిని లోపలికి పంపించడం జరిగింది.

ఈ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి వసంతారావు నాయక్ జడ్పిటిసి మురికిపూడి సుధాకర్ ఎంపీటీసీలు సర్పంచులు అన్ని రకాల కు సంబంధించి అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# వివిధ సమస్యలతో ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు వెంటనే మెరుగైన చికిత్స అందించే విధంగా డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్





మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి 05 జూలై వివిధ సమస్యలతో ఆసుపత్రికి వచ్చే పేషెంట్లకు వెంటనే మెరుగైన చికిత్స అందించే విధంగా డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు.

శుక్రవారం రోజున ఉప్పల్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మల్కాజిగిరి ఏరియా హాస్పటల్ ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలోని అన్ని వార్డు లను, ప్రతి ఓపిలను, ల్యాబ్, ఐ సియూ యూనిట్, ఆక్సిజన్ యూనిట్, ఎక్స్ రే, ప్రసూతి రూమ్ , ప్రత్యేక నవజాత శిశు కేంద్రం ,సునిశితంగా పరిశీలించి,అక్కడ పరిస్థితులు, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను క్షుణ్ణంగా పరిశీలించారు. వైద్య సదుపాయాల గురించి వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన చోట వైద్య పరికరాలు సమకూర్చుకోవాలని సూచించారు. ఆసుపత్రులలో వైద్య పరీక్షల గురించి ఆరా తీశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీ సంఖ్య మరింత పెరిగేలా చూడాలన్నారు. హై రిస్క్ ఉన్న కేసులను గుర్తించి గాంధీ,కోటి హాస్పిటల్ కు రిఫర్ చేయాలన్నారు. ప్రతిరోజు ఆసుపత్రికి ఎంతమంది పేషెంట్లు వస్తారని పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ సమస్యలతో వచ్చే పేషెంట్లకు వెంటనే మెరుగైన చికిత్స అందించే విధంగా డాక్టర్లు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

వైద్య సిబ్బంది ఎంతమంది హాస్పటల్ విధులు నిర్వహిస్తున్నారని ఆరా తీశారు .రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగ కుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి నిర్వహణ మెరుగ్గా ఉండాలన్నారు. స్కానింగ్ కోసం స్లాట్ లు బుక్ చేసుకునే విధానాన్ని సిబ్బంది కలెక్టర్ కు వివరించారు. ఫార్మసీలో మందుల నిల్వ గురించి ఆరా తీశారు. ల్యాబ్ రెటర్ లో ఉన్న సౌకర్యాల గురించి, జనరల్ మెడిసిన్,అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని క్షుణ్ణంగా పరిశీలించి సౌకర్యాల గురించితెలుసుకున్నారు.ఇప్పటివరకు మలేరియా డెంగ్యూ కేసులు ఎన్ని వచ్చాయని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.రాబోయే రోజుల్లో మలేరియా, డెంగ్యూ వ్యాధుల నుండి ప్రజలను కాపాడేందుకు ఆసుపత్రులలో వైద్య సౌకర్యాలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు.ఆరోగ్యశ్రీ సేవల గురించి వాకబ్ చేశారు.

ఈ కార్యమంలో జిల్లా డి ఎం అండ్ హెచ్ ఓ రఘునాథ స్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డి సి హెచ్ కోటియా నాయక్, సౌందర్య లత, మల్కాజ్గిరి డిఎం అండ్ హెచ్ వో ఆనంద్ ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ ఆర్ఎంఓ సునీత, సంగీత్ ,పద్మావతి సంధ్యారాణి,గీతా, చంద్రకళ ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అటవీ ఆంక్షలు ఎత్తివేయకపోతే అభివృద్ధి జరగదు



జన్నారం మండల విలేఖరి,జనసముద్రం న్యూస్, జూలై 5 కవ్వాల్ అభయారణ్యంలో ఆంక్షలు ఎత్తివేయకపోతే అభివృద్ధి జరగదని జన్నారం పట్టణానికి చెందిన సామాజికవేత్త భూమాచారి అన్నారు. అటవీ ఆంక్షలు ఎత్తివేయాలని కోరుతూ భూమచారి చేపట్టిన పాదయాత్ర శుక్రవారంజన్నారం మండలంలోని కలమడుగు గ్రామంలో జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను అభివృద్ధికి దూరం చేసిందన్నారు. భారీ వాహనాలు వస్తేనే ఉపాధి లభిస్తుందని, ఆంక్షలు ఎత్తివేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

# దమ్ముంటే మాచర్ల కు రా... మీ సుద్దపూస అక్రమాలు ఆధారాలతో చూపిస్తా





జనసముద్రంన్యూస్, జూలై 5,
పల్నాడు జిల్లా, మాచర్ల.

పులివెందుల ఎమ్మెల్యే దమ్ముంటే మాచర్ల కు వస్తే మీ సుద్దపూస ఉంగరాల బ్రదర్స్, గుడుంబా శంకర్ లు మాచర్లను చెర పట్టిన అక్రమాలు, అన్యాయాలు ఆధారాలతో సహా చూపిస్తానని ఓ వేదిక ఏర్పాటు చేయమంటావా అంటూ మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డికి సవాల్ విసిరారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల పై దాడులు జరుగుతున్న సమయంలో చిక్కటి చిరునవ్వులు చిందించిన జగన్ తన దోపిడి ముఠాలో సభ్యుడికి, కబ్జాకోరు కి అన్యాయం జరిగిందంటూ బయటకు వచ్చి మాట్లాడటం మాజీ ముఖ్యమంత్రి కి సిగ్గుచేటు అన్నారు. జగన్ తో నీతులు చెప్పించుకునే స్థితిలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు లేరని అన్నారు. ప్రజలకు మంచి చేసినా తాను ఓడిపోయానని చెప్పటం జగన్ దివాలాకోరు తనానికి నిదర్శనం అన్నారు. ఏ వర్గానికి న్యాయం చేశాడో చెప్పాలన్నారు . యువతను గంజాయి కి బానిస చేసి, గంజాయి మాటున వ్యాపారం చేసి వైసిపి నాయకులు కోట్లు గడించారని అన్నారు. అమరావతిపై కక్షగట్టి భవన నిర్మాణ రంగం పై ఆధారపడి జీవిస్తున్న అనేకమంది బడుగు బలహీన హీనవర్గాల వారి పొట్ట కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తన స్వప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టి దివాలా తీయించిన ఘనత జగన్ అని అన్నారు. రైతులకు గురించి మాట్లాడే అర్హత జగన్కు లేదని 3,500 కోట్ల రూపాయలతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి ఆదుకుంటానని వాగ్దానం చేసిన జగన్ ఎంతమంది రైతులని ఆదుకున్నారని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని లక్షల కోట్ల అప్పులు పాలు చేసి అగాధం సృష్టించారని విమర్శించారు. రాష్ట్రంలో ఒక్క ఎకరాకైనా సాగు నీరు ఇచ్చావా జగన్ అంటూ ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని , మాచర్ల పట్టణం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని నీ రౌడీ మూకలతో దాడులు చేయించి ధ్వంసం చేయించావు, ప్రజాధనంతో నిర్మించిన ప్రజా వేదికను కూల్చి సైకో ఆనందం పొందిన జగన్ మా పార్టీ ఆఫీసులపై ధ్వంసం చేసి దాడులు చేసిన వారిపై కేసులు పెడితే నేటి వరకు చర్యలు లేవు అని వీటిపై సమగ్ర విచారణ చేపడతామన్నారు. పాత కేసులన్నీ తిరగ తోడుతామని వైసిపి అవినీతి అక్రమాలకు, కబ్జాలకు తొత్తులుగా ఉన్న అధికారులు విచారణ ఎదుర్కొక తప్పదు అన్నారు. జగన్ ఉడత ఊపులకు తెలుగుదేశం పార్టీ భయపడదు అని అన్నారు. రాష్ట్ర ఖజానాను దోచుకున్న వారు ఏ స్థాయిలో ఉన్నా, ఎంతటి వారైనా వారి సహకరించిన వారు సైతం జైలుకు వెళ్లక తప్పదు అని అన్నారు. 99 శాతం హామీలను అమలు చేసినా ఓడిపోయాము అంటున్న జగన్ ఆ ఒక్క శాతం హామీ ఏమిటో ప్రజలకు తెలిపితే మేము తెలుసుకుంటామని అన్నారు. వైసీపీలో దోపిడీ చేయటమే మంచితనమా... గ్రానైట్ ప్రభుత్వ ఆస్తులు ప్రైవేట్ ఆస్తులు దోపిడీ చేసిన వ్యక్తిని మంచివాడు ,శుద్ధ పూస అంటూ మాట్లాడిన జగన్ తన యొక్క నైజాన్ని రాష్ట్ర ప్రజలకు తెలియజేశారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో అవమానాలు, వేధింపులు దాడులకు గురయ్యారని కానీ మా అధినేత ఆదేశాల మేరకు ఎక్కడ రెచ్చగొట్టే కార్యక్రమాలు చేయలేదని అన్నారు. నువ్వు చేసిన విధానాలు మా పార్టీ అధినేత అవలంబిస్తే ఇప్పటికే వైసిపి కార్యకర్తలు, నాయకులు రాష్ట్రం విడిచి వెళ్లి ఉండేవారని అన్నారు. నెలరోజులు కూడా పూర్తికాని ప్రభుత్వంపై అభాండాలు వేయటం వారి రాజకీయ పరిపక్వతకు నిదర్శనం అన్నారు. ఎన్నికల తర్వాత మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి పరామర్శకు వెళ్ళాడు అని జగన్ అనటం ప్రజలను అమాయకులను చేయటమేనని అన్నారు. పరామర్శలకు వెళ్లేవారు కత్తులు, రాడ్లు , గొడ్డళ్లు, బీరు బాటిళ్లు తీసుకుని ముఖాలు కనిపించకుండా మారువేషాలలో వెళ్తారా అని ప్రశ్నించారు. ఈ పత్రికా సమావేశంలో పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాతులూరు కుమార్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మున్నా రాంబాబు యాదవ్, కౌన్సిలర్ మదర్ సాహెబ్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మద్దిగపు వెంకట్రామిరెడ్డి, నేరెళ్ల వీరస్వామి, గుండాల శ్రీనివాస్ యాదవ్ ,యెనుముల కేశవరెడ్డి, సురేష్, అంజి, లాలా, వినోద్, జానీ, బండ్ల శ్రీనివాసరావు తెలుగుదేశం, జనసేన ,బిజెపి పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# బోనాల జాతరకు ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా చర్యలు తీసుకోవాలి



మల్కాజ్గిరి జనసముద్రం న్యూస్ జూలై 05:
అమ్మవారి బోనాల జాతరకు ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా చర్యలు తీసుకోవాలని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ శానిటేషన్, రాంకీ, ఇతర అధికారులకు సూచించారు. ఈనెల 28న జరగనున్న బోనాల వేడుకలు దృష్టిలో పెట్టుకొని శుక్రవారం గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఆమె కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని సుమారు 30 నుంచి 40 అమ్మవారి ఆలయాలు ఉన్నాయని ఆలయాలు మరియు ఆలయాల పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు జిహెచ్ఎంసి పారిశుద్ధ్య సూపర్వైజర్లు మరియు సిబ్బందితో పాటు రాంకీ సంస్థ ఇతర అధికారుల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి పారిశుద్ధ్య సూపర్వైజర్ నాగరాజు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అధికారి మాతృ సంస్థ వేగురుపల్లి ఉన్నత పాఠశాలలో నమోదు సంఖ్య అంతంత మాత్రమే.

## అమ్మ లాంటి పాఠశాల పై అణువంత శ్రద్ధ లేని అధికారి.





జనసముద్రం జమ్మికుంట (టౌన్) న్యూస్ ప్రతినిధి: 5 జూలై కరీంనగర్ జిల్లాలోని మానకొండూర్ మండలంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేగురుపల్లిలో విద్యార్థుల నమోదు సంఖ్య పూర్తిగా పడిపోయింది. వేగురుపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మానకొండూరు మండలం ఇన్చార్జివిద్యాశాఖఅధికారి మియాపురం మధుసూదనాచారీ నిర్లక్ష్యం, అలసత్వం మూలంగా పాఠశాలలో ఈ పరిస్థితి నెలకొందని జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ వర్గాలలో చర్చనీయాంశంగా మారింది.

అదనపు బాధ్యతల పేరట పాఠశాలను అదోగతి పాలు చేయడం గమనార్హం.

కనీసం వారంలో ఒక్కరోజైనా వేగురుపల్లి ఉన్నత పాఠశాలను సందర్శించిన దాఖలాలు లేవు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మియాపురం మధుసూదనాచారి మొన్నటి వరకు మానకొండూరు మండల ఎంపిటిసి భర్తకు, సర్పంచి భర్తకు చెంచాగా..బానిసగా.. వ్యవహరించడం పలువురిని ఆశ్చర్యానికి గురిచేసింది.

ఏ రోటి కాడి పాట ఆరోటి కాడనే పాట పాడుతూ కాలం వెల్లదీసుకుంటూ పైశాచిక ఆనందం పొందుతూ ఉండడం మియాపురం మధుసూదనాచారికి వెన్నతో పెట్టిన విద్య. మొన్నటి వరకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్ది నుండి స్పౌజ్ కీటగిరిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేగురుపల్లికి బదిలీ అయినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయం ఉపాధ్యాయ సబ్బండ వర్గాలకు విధితమే.

ఇది ఇలా ఉండగా ఇన్ చార్జి మండల విద్యాశాఖ అధికారి ప్రజాప్రతినిధులభర్తలకు సెల్యూట్ చేస్తూ, అందలాలెక్కిస్తూ, మరి కొన్ని పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేసిన సందర్భాలు కోకొల్లలుగా ఉన్నాయి.

అధికారి (డీఈఓ) దగ్గర మార్కులు కొట్టడానికి ఏదైనా తాకట్టు పెట్టడానికి వెనుకాడని మనస్తత్వం, వైఖరి గల మియాపురం మధుసూదనాచారీ ఇద్దరు బార్యలు ఉన్నట్లు సమాచారము.

వారి లోఒకరు హెల్త్ డిపార్ట్మెంట్ లో నర్సు, మరొకరు ప్రభుత్వ టీచర్ గా కొనసాగింపులు.

డీఈవో జనార్ధన్ రావు దగ్గర చెంచాగిరి చేస్తూ తనదైన శైలిలో దూసుకుపోతున్నారు. ఏ ఒక్కరోజు కూడా వేగురుపల్లి ఉన్నత పాఠశాలకు వచ్చి విద్యార్థుల చదువులు, పాఠశాల స్థితిగతులపై చొరవ తీసుకున్న దాఖలాలు లేవు. దీనిపై ప్రాంతీయ విద్యాశాఖ సంచాలకులు (ఆర్జెడి) వరంగల్ కే. సత్యనారాయణ రెడ్డి తక్షణమే స్పందించి ఎంఈఓ బాధ్యతల నుండి తప్పించి మాతృ సంస్థ వేగురుపల్లి ఉన్నత పాఠశాలకి పరిమితం చేయాలని ఉపాధ్యాయులు, మేధావి వర్గాలు,విద్యార్థి సంఘాలు, సామాజిక విశ్లేషకులు కోరుతున్నారు.

Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL/2021/16151 for Queries Contact us @ 94941 84136, janasamudram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb/janasamudram